# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 361, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) శనివారం - 15 - మార్చి - 2025


## కిమ్ జోంగ్ ఉన్ తో ఇప్పటికీ నాకు మంచి సంబంధాలు ఉన్నాయి: డొనాల్డ్ ట్రంప్



- కిమ్ ఒక అణుశక్తి అన్న డొనాల్డ్ ట్రంప్
- మనం అణ్వాయుధాలను తగ్గించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్య
- ఉత్తరకొరియా, ఇండియా, పాకిస్థాన్ వద్ద కూడా అణ్వాయుధాలు ఉన్నాయన్న ట్రంప్

నేషనల్ డెస్క్: ఉత్తరకొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

## ప్రధాని మోదీకి థ్యాంక్స్ చెప్పిన పుతిన్



మాస్కో: ఉక్రెయిన్, రష్యా మధ్య శాంతి నెలకొల్పేందుకు ప్రపంచ దేశాల నేతలు చేస్తున్న ప్రయత్నాలపై వ్లాదిమిర్ పుతిన్స్పందించారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని మోదీలకు ఆయన థ్యాంక్స్ తెలిపారు. ఉక్రెయిన్, రష్యా యుద్ధాన్ని ఆపేందుకు ట్రంప్, మోదీలు నోబెల్ మిషన్ చేపట్టినట్లు తెలిపారు. ఉక్రెయిన్తో 30 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరే అవకాశం ఉన్న నేపథ్యంలో

## ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా విజయాలకు వాళ్లే కారణం: రికీ పాంటింగ్



- భారత విజయంలో ఆల్‌రౌండర్లదే కీలక పాత్ర అని కొనియాడిన పాంటింగ్
- జడేజా, అక్షర్, పాండ్యా అద్భుత ప్రదర్శన చేశారని కితాబు
- ఆల్ రౌండర్ల కారణంగా జట్టులో సమతూకం వచ్చిందని వెల్లడి
- నాణ్యమైన ఫాస్ట్ బౌలింగ్ లేకపోయినా విజయం సాధించారని ప్రశంసలు

## రాజాసింగ్ వ్యాఖ్యలతో రేవంత్ రెడ్డి దొరికిపోయారు... రహస్య సమావేశం సిగ్గుచేటు



- బీజేపీ నేతలతో రహస్యంగా సమావేశం కావడం సిగ్గుపడాల్సిన విషయమన్న కేటీఆర్
- ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి చీకటి సమావేశాలు పెట్టడమేమిటని ప్రశ్న
- దిక్కుమాలిన చిల్లర రాజకీయాలు తెలంగాణ నేలపై ఇంత వరకు చూడలేదని వ్యాఖ్య

# మనం నిలదొక్కుకోవడమే కాదు... నాలుగు దశాబ్దాల టీడీపీని కూడా నిలబెట్టాం

- జనసేన 12వ ఆవిర్భావ సభ
- పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ వద్ద జయకేతనం సభ
- పవన్ కల్యాణ్ ఆవేశపూరిత ప్రసంగం
- అలాగైతే తమిళ సినిమాలు హిందీలో డబ్ చేయకండి... హిందీ వద్దనుకున్నప్పుడు హిందీ రాష్ట్రాల నుంచి డబ్బులు ఎందుకు?: పవన్
- తమిళనాడుతోసహా భారతదేశం అంతటికీ కావాల్సింది రెండు భాషలు కాదు... బహు భాషలు కావాలి: పవన్ కల్యాణ్




చిత్రాడ : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభ కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో చిత్రాడ వద్ద నిర్వహించారు. ఈ సభలో జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉద్వేగభరితంగా ప్రసంగించారు. 2014లో అన్నీ తానై పార్టీ పెట్టానని, అనేక కష్టాలను ఎదుర్కొని ప్రస్థానం కొనసాగించానని వెల్లడించారు. 2019లో ఎన్నికల్లో పోటీ చేశామని... ఓడిపోయినా అడుగు ముందుకే వేశామని అన్నారు. "మనం నిలబడ్డాం... పార్టీని నిలబెట్టాం. మనం నిలదొక్కుకున్నాం... మనం నిలదొక్కుకోవడమే కాకుండా నాలుగు దశాబ్దాల టీడీపీని కూడా నిలబెట్టాం. మనం 2019లో ఓడినప్పుడు మీసాలు మెలేశారు,

## తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను అంగీకరించకపోతే టీటీడీతో తేల్చుకుంటాం



- లేఖలు అంగీకరించకుంటే తిరుమలకు వచ్చి తేల్చుకుంటామని వ్యాఖ్య
- శ్రీవారి దర్శనాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలన్న బీజేపీ ఎంపీ
- ఈ విషయంపై చంద్రబాబు స్పందించాలన్న రఘునందన్ రావు

## స్పీకర్‌ను ఉద్దేశించి జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదు



- సభ నీ ఒక్కడిది కాదని స్పీకర్‌ను ఉద్దేశించి అనడం సరికాదన్న మంత్రి
- శాసనసభలో స్పీకర్ స్థాయిని తగ్గించేలా ఆయన మాట్లాడారని ఆగ్రహం
- నిరసనలు, ధర్నాలు చేపట్టడం విడ్డూరమన్న పొన్నం ప్రభాకర్

## నా తమ్ముడు ఏ రోజు ఏ వేషం వేయాలో ఆ వేషం వేస్తాడు

## పవన్ పై కేఏ పాల్ సెటైర్లు




- పవన్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నాడన్న పాల్
- చర్చిలపై జీవోను వ్యతిరేకిస్తున్నట్టు వెల్లడి
- మతాల మధ్య చిచ్చు పెట్టవద్దని హితవు.

# పల్నాడు కేంద్రంగా రంగంలోకి జగన్

## -తొలి సమరం..!!

- మాజీ సీఎం జగన్ అనూహ్య నిర్ణయం
- ప్రజలకు దగ్గరయ్యేలా ప్రణాళికలు సిద్ధం
- త్వరలో జిల్లాల పర్యటనలకు జగన్ సిద్ధం
- త్వరలోనే ఛలో పిన్నెల్లి నిర్వహిస్తామని జగన్ వెల్లడి
- జగన్ జిల్లాల పర్యటన పైన వచ్చే వారం కీలక ప్రకటన




**అమరావతి,:** మాజీ సీఎం జగన్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల్లో ఓడిన తరువాత జగన్ తిరిగి పార్టీ కేడర్ .. ప్రజలకు దగ్గరయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం పైన ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని చెబుతున్న జగన్.. ఇప్పటికే పలు నిరసనలకు పిలుపునిచ్చారు. ఇదే సమయంలో జిల్లాల పర్యటనలకు సిద్ధం అవుతున్నారు. పార్టీలో పెండింగ్ లో ఉన్న నియామక ప్రక్రియ పూర్తి



చేస్తున్నారు. ఇప్పుడు తాజాగా పల్నాడు కేంద్రంగా జగన్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. తానే స్వయంగా రంగంలోకి దిగాలని నిర్ణయించారు.

## నామినేటెడ్ పదవులకు పేర్లను సిఫారసు చేయకుండా కొంతమంది నేతలు ఆలస్యం చేస్తున్నారు: సీఎం చంద్రబాబు

- మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్
- నామినేటెడ్ పోస్టుల కోసం కసరత్తు చేస్తున్నామని వెల్లడి
- పార్టీ కోసం కష్టపడిన వారికే పదవులు అని స్పష్టీకరణ
- పార్టీ కోసం శ్రమించిన వారి వివరాలు పంపాలని నేతలకు ఆదేశం




**అమరావతి,:** ఏపీ సీఎం చంద్రబాబు నేడు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నేతలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నామినేటెడ్ పదవుల భర్తీకి కసరత్తులు చేస్తున్నామని చెప్పారు. నామినేటెడ్ పదవులకు పేర్లను సిఫారసు చేయకుండా కొంతమంది నేతలు ఆలస్యం చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడిన వారికే నామినేటెడ్ పదవులు ఇస్తున్నాం... పార్టీ కోసం శ్రమించిన వారి వివరాలను నేతలు అందజేయాలి అని చంద్రబాబు స్పష్టం చేశారు. సరైన వ్యక్తులను సరైన పదవుల్లో నియమిస్తామని పేర్కొన్నారు.

## చంద్రబాబు, పవన్ కల్యాణ్ నా బాధ్యతను మరింత పెంచారు



- ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన నాగబాబు
- తనతో పాటు ఎమ్మెల్సీలుగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపిన నాగబాబు
- నాగబాబును మంత్రిని చేస్తామని గతంలోనే ప్రకటించిన చంద్రబాబు

# పవన్ కంగ్రాట్స్ అన్న లోకేష్!




**అమరావతి,:** జనసేన మీద పవన్ మీద లోకేష్ తనకు ఉన్న సాఫ్ట్ కార్నర్ ని అలా చాటుకున్నారని అంటున్నారు. మంత్రి నారా లోకేష్ జనసేన బంధాన్ని అంతకంతకు పెంచుకుపోతున్నారు. జనసేన మీద ఆయన అపారమైన గౌరవాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇక పవన్ కళ్యాణ్ ని అయితే అన్నా అని ఎంతో ఆత్మీయతతో సంభోదిస్తారు. పవన్ కి ఎక్కడ లేని మర్యాద ఇస్తారు. ఇటీవల మెగా బ్రదర్ నాగబాబు ఎమ్మెల్సీ నామినేషన్ వేయడానికి వచ్చినపుడు మంత్రి నారా లోకేష్ అటెండ్ అయి ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ఆయన స్వయంగా నాగబాబుకు స్వాగతం పలికి జనసైనికుల మనసును దోచేశారు. ఆద్యంతం నామినేషన్ కార్యక్రమంలో

## కిమ్ జోంగ్ ఉన్ తో ఇప్పటికీ నాకు మంచి సంబంధాలు ఉన్నాయి: డొనాల్డ్ ట్రంప్

ఉత్తరకొరియా: ఉత్తరకొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కిమ్ తో తనకు ఇప్పటికీ మంచి సంబంధాలు ఉన్నాయని ఆయన చెప్పారు. కానీ, కిమ్ ఒక అణుశక్తి అని వ్యాఖ్యానించారు. ఏం జరుగుతుందో చూద్దామని అన్నారు. నాటో సెక్రెటరీ జనరల్ మార్క్ రుట్టేతో ఓవల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు. మన దగ్గర చాలా ఆయుధాలు ఉన్నాయని... వాటి శక్తి చాలా ఎక్కువని ట్రంప్ చెప్పారు. మనం అణ్వాయుధాల సంఖ్యను తగ్గించగలిగితే అది గొప్ప విజయం అవుతుందని అన్నారు. అణ్వాయుధాలను తగ్గించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఉత్తరకొరియా, ఇండియా, పాకిస్థాన్ వద్ద కూడా అణ్వాయుధాలు ఉన్నాయని అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలు ఉత్తరకొరియా అణ్వాయుధ విధానంలో ఎలాంటి మార్పునైనా సూచిస్తున్నాయా? అనే ప్రశ్నకు వైట్ హౌస్ అధికారి మాట్లాడుతూ... ట్రంప్ తన తొలి పదవీకాలంలో చేసినట్టుగానే ఉత్తరకొరియాను అణ్వాయుధ రహితంగా చేస్తారని చెప్పారు. ట్రంప్ తన తొలి పదవీకాలంలో కిమ్ తో చర్చలు జరిపిన సంగతి తెలిసిందే.

## ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా విజయాలకు వాళ్లే కారణం: రికీ పాంటింగ్

న్యూఢిల్లీ: భారత జట్టు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో విజయం సాధించడానికి రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్ ఆటగాళ్ల అనుభవం మాత్రమే కాకుండా, ఆల్‌రౌండర్ల అద్భుత ప్రదర్శన కూడా కారణమని ఆసీస్ లెజెండ్ రికీ పాంటింగ్ కొనియాడాడు. ఐసీసీ రివ్యూలో మాట్లాడుతూ పాంటింగ్ ఈ విషయాన్ని వెల్లడించాడు. రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యా వంటి ఆల్ రౌండర్లు విశేషంగా రాణించారని ప్రశంసించాడు. జట్టులో యువత, అనుభవం కలగలిపి ఉండటం వల్ల భారత్‌ను ఓడించడం కష్టమని టోర్నమెంట్ ప్రారంభంలోనే తాను చెప్పానని గుర్తు చేశాడు. దానికితోడు ఫైనల్‌లో కెప్టెన్ తన జట్టు కోసం నిలబడి విజయాన్ని అందించాడని పాంటింగ్ వివరించాడు. ఇటీవల ముగిసిన ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఆడిన ఐదు మ్యాచ్‌లలోనూ ముగ్గురు ఆల్‌రౌండర్లను తుది జట్టులో ఆడించింది. తద్వారా బ్యాటింగ్ లైనప్ బలోపేతం కావడంతో పాటు బౌలింగ్‌లోనూ వెసులుబాటు కలిగింది. టోర్నీ ఆసాంతం భారత జట్టు చాలా సమతూకంతో ఉందని, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ వంటి ఆల్‌రౌండర్లు ఉండటంతో జట్టు కూర్పు మరింత బలంగా తయారైందని పాంటింగ్ అభిప్రాయపడ్డాడు. అక్షర్ పటేల్‌ను కొన్నిసార్లు బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందు పంపించారని, జడేజా కూడా జట్టుకు ఎంతో ఉపయోగపడ్డాడని గుర్తు చేశాడు. అయితే, జట్టులో ఫాస్ట్ బౌలింగ్ కాస్త తక్కువగా ఉందనిపించిందని, కానీ ఆ ప్రభావం ఏ మాత్రం కనిపించలేదని పాంటింగ్ పేర్కొన్నారు. హార్దిక్ పాండ్యా కొత్త బంతితో బౌలింగ్ చేయగలగడం, ప్రారంభ ఓవర్లు వేయడం స్పిన్నర్లకు మరింత సులువు చేసిందని పాంటింగ్ అన్నాడు. స్పిన్నర్లు మిడిల్ ఓవర్లలో ఆధిపత్యం చెలాయించడానికి ఇది ఉపయోగపడిందని తెలిపాడు. అక్షర్ పటేల్‌ను పాంటింగ్ ప్రత్యేకంగా మెచ్చుకున్నాడు. అతను టోర్నమెంట్‌లో నిలకడగా రాణించాడని, అతని బౌలింగ్ చాలా కట్టుదిట్టంగా ఉందని కితాబిచ్చాడు.. బ్యాటింగ్‌లోనూ కీలక సమయాల్లో ఆదుకున్నాడని, కేఎల్ రాహుల్, పాండ్యా, జడేజా వంటి వారు మరింత సులువుగా ఆడేందుకు సహకరించాడని పాంటింగ్ పేర్కొన్నారు. అక్షర్ పటేల్ ఈ టోర్నమెంట్‌లో ప్రశంసలు అందుకోవడానికి అర్హుడని ఆయన అభిప్రాయపడ్డాడు.

## తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను అంగీకరించకపోతే టీటీడీతో తేల్చుకుంటాం

**హైదరాబాద్, :** తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల సిఫార్సు లేఖలను అనుమతించకపోతే ప్రజాప్రతినిధులం అందరం తిరుమలకు వచ్చి టీటీడీతో తేల్చుకుంటామని మెదక్ ఎంపీ, బీజేపీ నేత రఘునందన్ రావు హెచ్చరించారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనాలు కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, టీటీడీ పాలక మండలి చేసిన ప్రకటనను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం వీఐపీ బ్రేక్ దర్శనం సమయంలో ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నరు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, వేసవి సెలవుల్లో తమ సిఫార్సు లేఖలపై వచ్చే భక్తులకు దర్శనాలు కల్పించాలని, లేదంటే టీటీడీతో తేల్చుకుంటామని ఆయన అన్నారు. ఈ విషయంపై తిరుమల తిరుపతి దేవస్థానం వెంటనే స్పందించాలని అన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను ఆమోదిస్తామని బీఆర్ నాయుడు నాయకత్వంలోని టీటీడీ బోర్డు ప్రకటించిందని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 294 మంది ఎమ్మెల్యేలకు అనుమతి ఉండగా, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రాంత ఎమ్మెల్యేలకే పరిమితం కావడం బాధాకరమని ఆయన అన్నారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖల పట్ల వివక్ష ఉండవద్దని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎలాగైతే సిఫార్సు లేఖలను అంగీకరించారో, ఇప్పుడు అలాగే అంగీకరించాలని కోరారు. ఈ విషయంలో చంద్రబాబు జోక్యం చేసుకోవాలని కోరారు.

## రాజాసింగ్ వ్యాఖ్యలతో రేవంత్ రెడ్డి దొరికిపోయారు... రహస్య సమావేశం సిగ్గుచేటు

**హైదరాబాద్, :** తెలంగాణ బీజేపీ నేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రహస్యంగా సమావేశం కావడం సిగ్గుపడాల్సిన విషయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో బీజేపీ కోవర్టులు ఉన్నారని రంకెలు వేసే రాహుల్ గాంధీకి, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలతో దొరికిపోయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకునే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. తెలంగాణ బీజేపీకి చెందిన కొందరు నాయకులు రేవంత్ రెడ్డితో రహస్యంగా భేటీ అవుతున్నారని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన ఆరోపణలు చేసినట్టు వచ్చిన పత్రికా కథనాన్ని తన 'ఎక్స్' వేదికగా పంచుకున్న కేటీఆర్ విమర్శలు గుప్పించారు. "బీజేపీ నేతలతో కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రహస్య సమావేశాలా.. సిగ్గు.. సిగ్గు..!" అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి అధికారిక సమావేశాలు నిర్వహించాలి కానీ ఈ చీకటి సమావేశాలు పెట్టడమేమిటని ప్రశ్నించారు. ఇలాంటి దిక్కుమాలిన చిల్లర రాజకీయాలు తెలంగాణ నేలపై ఇంత వరకు ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. ఒకవైపు బయటకు బీజేపీ నేతలతో కుస్తీపడుతున్నట్లు పోజులు కొట్టి, దొంగచాటుగా దోస్తీ చేసే ఈ నీచ సంస్కృతికి తెరలేపడం అత్యంత దుర్మార్గమని అన్నారు. ఏ గూడుపుఠాణి చేయడానికి ఈ తెరచాటు సమావేశాలు నిర్వహిస్తున్నారో దమ్ముంటే ముఖ్యమంత్రి బయటపెట్టాలని కేటీఆర్ నిలదీశారు. పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా, గురుకులాల్లో విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా, ఒక్క సమీక్ష నిర్వహించే సమయం లేని ముఖ్యమంత్రికి, ఈ రహస్య సమావేశాలకు మాత్రం సమయం దొరకడం క్షమించలేని ద్రోహమని అన్నారు. అట్టర్ ఫ్లాప్ ముఖ్యమంత్రిగా ముద్రపడి, ఇక ఏ క్షణంలోనైనా తన సీఎం కుర్చీ చేజారే సూచనలు కనిపించడం వల్లే ముఖ్యమంత్రి బీజేపీతో ఈ చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నట్లు స్పష్టమవుతోందని అన్నారు. ఏడాదిన్నరలో రాష్ట్రాన్ని ఆగంచేసి, డర్టీ పాలిటిక్స్ చేస్తున్న ఈ రాబందు రాజకీయాలను తెలంగాణ సమాజం మాత్రం ఎట్టి పరిస్థితుల్లో సహించదని పేర్కొన్నారు. రెండు ఢిల్లీ పార్టీలకు తెలంగాణ సమాజం కర్రు కాల్చి వాతపెడుతుందని ఆయన పేర్కొన్నారు.

## స్పీకర్‌ను ఉద్దేశించి జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదు

**హైదరాబాద్, :** 'సభ నీ ఒక్కడిది కాదు' అని స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అనడం సరికాదని, అసెంబ్లీలో ఏ విధంగా ప్రవర్తించాలో తెలిసి కూడా బీఆర్ఎస్ నేతలు ఉద్దేశపూర్వకంగా ఈరోజు నిరసనలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. శాసనసభలో స్పీకర్ స్థాయిని తగ్గించేలా ఆయన మాట్లాడారని విమర్శించారు. స్పీకర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ధర్నాలు చేయడం, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రవర్తించిన వాళ్లే నిరసన తెలపడం హాస్యాస్పదమని ఆయన వ్యాఖ్యానించారు. జగదీశ్ రెడ్డి చేసిన పొరపాటును బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం గుర్తించి, ఆయనను మందలిస్తుందనుకుంటే నిరసనలు చేపట్టడం విడ్డూరమని అన్నారు. బీఆర్ఎస్ నేతల తీరును ప్రజలు గమనించాలని కోరారు.

## నా తమ్ముడు ఏ రోజు ఏ వేషం వేయాలో ఆ వేషం వేస్తాడు



**అమరావతి,:** ప్రముఖ క్రైస్తవ ప్రబోధకుడు కేఏ పాల్ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై తీవ్ర విమర్శలు గుప్పించారు. పవన్ కళ్యాణ్ రాజకీయంగా అవకాశవాదిగా వ్యవహరిస్తున్నారని, ఆయన సిద్ధాంతాలు మారుస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. పవన్ కళ్యాణ్ ఒకవైపు సనాతన ధర్మాన్ని అనుసరిస్తున్నానని చెబుతూనే, మరోవైపు చర్చిలో బాప్తిస్మం తీసుకున్నానని చెప్పడం ఆయన ద్వంద్వ నీతికి నిదర్శనమని పాల్ విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసమే పవన్ కళ్యాణ్ ఇలాంటి వేషాలు వేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. "పవన్ కళ్యాణ్ పుట్టుక నుంచి సనాతన వాది కదా! పవన్ కళ్యాణ్ మొన్నటి వరకు నేను బీఫ్ తిన్నాను మా నాన్న బీఫ్ తిన్నాడు అన్నాడు. మరి సనాతన వాది బీఫ్ తింటాడా... ముస్లిం వేషం వేస్తాడా...? జోర్డాన్ లో చర్చికి వెళ్లి నేను బాప్తిస్మం పొందాను అన్నాడు... నువ్వు పుట్టుకతోనే సనాతన వాదివి అయితే బాప్తిస్మం ఎలా తీసుకుంటావా? నా తమ్ముడు (పవన్ కళ్యాణ్) ఎప్పుడూ సెక్యులరే... ఏ రోజు ఏ వేషం వేయాలో ఆ వేషం వేస్తాడు. రాజకీయ పవర్ కొరకు బయటకు వచ్చేస్తాడు. బాగుపడాలంటే దేవుడు ఉన్నాడు... మోదీ కాపాడలేడు నిన్ను. గాంధీ ప్రాణం పెట్టాడు కానీ అమ్ముడు పోలేదు... అంబేద్కర్ మంత్రి పదవిని కాళ్ళతో తన్నాడు కానీ అమ్ముడు పోలా... ఎన్టీ రామారావు అధికారం పోయిన తర్వాత మనోవేదనతో ప్రాణం పెట్టాడు కానీ అమ్ముడు పోలా. వాళ్ళ కాలి గోరు తీయడానికి మీరందరూ పనికొస్తారా? సెక్యులరిజమే నడుస్తుంది... కమ్యూనలిజం నడదు... దేవుని ఉగ్రత వచ్చిందా నీ గుండె ఆగి నిమిషంలో పోతావ్! హిందూస్, ముస్లిమ్స్, క్రిస్టియన్ మధ్య గొడవలు పెట్టకండి... ప్రపంచ శాంతి దూత అయిన ఈ కేఏ పాల్ ను చూసి నేర్చుకోండి" అంటూ పాల్ వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా, అనుమతి లేని చర్చిలపై చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ ఫిబ్రవరి 10న జీవో జారీ చేశారంటూ కేఏ పాల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ కు చట్టాలపై అవగాహన లేదని, మత స్వేచ్ఛను ఆయన ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ప్రజలు సీరియస్ గా తీసుకోవద్దని, ఆయన మాటలకు విలువ లేదని అన్నారు. ప్రపంచ శాంతి కోసం తాను చేసిన కృషిని పాల్ గుర్తు చేశారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపడానికి తాను గతంలో చేసిన ప్రయత్నాలను వివరించారు. ప్రస్తుతం తాను దేశంలో ఉండటం వల్ల ఆ ప్రయత్నాలు కొనసాగించలేకపోతున్నానని ఆయన అన్నారు. తన రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిని ప్రజలకు తెలియజేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని పాల్ స్పష్టం చేశారు.

## మనం నిలదొక్కుకోవడమే కాదు... నాలుగు దశాబ్దాల టీడీపీని కూడా నిలబెట్టాం

మొదటి పేజి తరువాయి




మనం 2019లో ఓడినప్పుడు మీసాలు మెలేశారు, జబ్బలు చరిచారు, తొడలు కొట్టారు, మన ఆడపడుచులను అవమానించారు, ప్రజలను నిరంతరం హింసించారు. ఇదేం న్యాయం అని మన జనసైనికులు, వీరమహిళలు అడిగితే, గొంతెత్తితే వాళ్లపై కేసులు పెట్టారు, జైళ్లలో పెట్టారు. నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న టీడీపీ నాయకుడ్ని అక్రమ కేసుల్లో జైల్లో బంధించారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను, వారి సీనియర్ నేతలను రోడ్డు మీదికి రావాలంటే భయపడేలా చేశారు. ఇక నాలాంటి వాడ్ని అయితే వారు తిట్టని తిట్టు లేదు, చేయని అవమానం లేదు, చేయని కుట్ర లేదు. అసెంబ్లీ గేటు కూడా తాకలేవు అని ఛాలెంజ్ చేసి చరిచిన ఆ తొడలను బద్దలు కొట్టాం. ఏపీ అసెంబ్లీలో 21 మంది ఎమ్మెల్యేలతోటి, పార్లమెంటులో ఇద్దరు ఎంపీలతోటి అడుగుపెట్టాం. దేశం అంతా తలతిప్పి చూసేలా 100 శాతం స్ట్రయిక్ రేట్ తో విజయం సాధించాం... ఇవాళ జయకేతనం ఎగరేస్తున్నాం.... జై జనసేన" అంటూ పవన్ ప్రసంగించారు.

అలాగైతే తమిళ సినిమాలు హిందీలో డబ్ చేయకండి... హిందీ వద్దనుకున్నప్పుడు హిందీ రాష్ట్రాల నుంచి డబ్బులు ఎందుకు?: పవన్

కేంద్ర ప్రభుత్వం తమపై హిందీని బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తోందంటూ తమిళనాడులో తీవ్ర రాజకీయ దుమారం చెలరేగుతున్న వేళ జనసేన పార్టీ అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మాట్లాడితే సంస్కృతాన్ని తిడతారు, దక్షిణాదిపై హిందీని రుద్దుతున్నారు అంటారు... అన్నీ దేశ భాషలే కదా! తమిళనాడులో హిందీ వద్దు, హిందీ వద్దు అంటుంటే నాకు మనసులో ఒకటే అనిపించింది. తమిళ సినిమాలను హిందీలోకి డబ్ చేయకండి. డబ్బులేమో హిందీ నుంచి కావాలి... ఉత్తరప్రదేశ్ నుంచి డబ్బులు కావాలి, బీహార్ నుంచి డబ్బులు కావాలి, ఛత్తీస్ గఢ్ నుంచి డబ్బులు కావాలి... పనిచేసేవాళ్లందరూ బీహార్ నుంచి కావాలి... కానీ మేం హిందీని ద్వేషిస్తాం అంటే ఇదెక్కడి న్యాయం? ఈ విధానం మారాలి. భాషలను ద్వేషించాల్సిన అవసరం లేదు. మీరు ముస్లింలను చూసి నేర్చుకోండని హిందువులందరికీ చెబుతుంటాను... ఆలయాల్లో సంస్కృతంలో మంత్రాలు చదవకూడదని అంటుంటారు... మరి ముస్లింలు అలా ఎప్పుడైనా అంటుంటారా? ముస్లింలు ఎక్కడి వారైనా కావొచ్చు... అరబిక్ లేదా ఉర్దూలో ప్రార్థిస్తారు. హిందూ ధర్మంలో సంస్కృతంలోనే మంత్రాలు ఉంటాయి... మరి అలాంటప్పుడు తమిళంలో మంత్రాలు చదవాలా, తెలుగులో మంత్రాలు చదవాలా?" అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు.

తమిళనాడుతోసహా భారతదేశం అంతటికీ కావాల్సింది రెండు భాషలు కాదు... బహు భాషలు కావాలి: పవన్ కల్యాణ్

జనసేన 12వ ఆవిర్భావ సభలో పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పలు భాషల్లో ప్రసంగించారు. తద్వారా, ఆయా రాష్ట్రాల్లోని తన అభిమానులను అలరించారు. ఇవాళ సీనియర్ నాయకుడు కొణతాల చెప్పినట్టుగా... నేడు హోలీ పండుగ రోజు, జనసేన జయకేతనం సభ ఒక్కరోజే రావడం యాదృచ్ఛికం కాదు... అది భగవంతుడి నిర్ణయం అని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ తనకు అభిమానులు ఉన్నారని వెల్లడించారు. ఇటీవల తాను తమిళనాడులో షణ్ముఖ యాత్ర చేసినప్పుడు మీ ప్రసంగాలు చూస్తుంటాం అని అక్కడి వారు చెప్పారని వెల్లడించారు. మహారాష్ట్రలో పర్యటించాలని దేవేంద్ర ఫడ్నవీస్ కోరారని, హర్యానాలోనూ పర్యటించాలని కోరారని వివరించారు. ఎన్డీఏ కూటమి కోసం తాను మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నానని... తాను ప్రచారం చేసిన నియోజకవర్గాల్లో ఒక్కటి తప్ప అన్ని చోట్లా కూటమి గెలిచిందని తెలిపారు. ఈ క్రమంలో పవన్ హిందీ, తమిళం, మరాఠీ, కన్నడ భాషల్లో ప్రసంగించారు. ఈ సందర్భంగా తమిళనాడు వర్సెస్ కేంద్ర ప్రభుత్వం మధ్య నెలకొన్న భాషా వివాదంపై పరోక్షంగా స్పందించారు. తమిళనాడుతో సహా భారతదేశమంతటికీ రెండు భాషలు కాదని బహుభాషలు ఉండాలని అభిలషించారు. ప్రజల మధ్య పరస్పర ప్రేమాభిమానాలు ఉండాలంటే భారతదేశానికి బహుభాషా విధానమే మంచిదని అభిప్రాయపడ్డారు. బోలో భారత్ మాతాకీ జై అంటూ నినాదం చేశారు.

ఆ రోజు కరెంట్ షాక్ తగిలిన నాకు తెలంగాణ గడ్డ పునర్జన్మనిచ్చింది: పవన్ కల్యాణ్

జయకేతనం సభలో జనసేనాని పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రస్తావన తీసుకువచ్చారు. జనసేన జన్మస్థలం తెలంగాణ అయితే... ఆంధ్రప్రదేశ్ కర్మస్థలం అని పేర్కొన్నారు. తెలంగాణ కోటి రతనాల వీణ అని కొనియాడారు. ఆ రోజున కరెంట్ షాక్ తగిలి చనిపోబోయిన తనకు కొండగట్టు ఆంజనేయస్వామి దీవెన, తెలంగాణ అన్నదమ్ముల దీవెన, తనను ప్రేమించే ప్రజలందరి దీవెన ఉన్నాయని... తద్వారా తెలంగాణ భూమి తనకు పునర్జన్మనిచ్చిందని వివరించారు. అలాంటి తెలంగాణ నేల తల్లికి హృదయపూర్వక వందనాలు తెలుపుకుంటున్నానని వెల్లడించారు. బండినెక బండికట్టి అంటూ కాలికి గజ్జెకట్టిన వాడు, నేను కనిపిస్తే ఎలా ఉన్నావురా తమ్మీ అని ఆప్యాయంగా పలకరించే మన మధ్య లేని నా అన్న, మన గద్దరన్న నేల నుంచి వచ్చిన తెలంగాణ జనసైనికులకు, వీర మహిళలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. మా ఆడపడుచులు, మా వీరమహిళల పోరాట స్ఫూర్తి మరువలేను. మీరు అందరి దృష్టిలో రాణి రుద్రమ్మలు. సూర్యభగవానుడి లేలేత కిరణాలు మా వీరమహిళలు... తేడా వస్తే కాల్చి ఖతమ్ చేసే లేజర్ బీమ్ లు మా జనసేన వీరమహిళలు. మీకు నేను రుణపడి ఉంటాను. జనసేన పుట్టింది తెలంగాణ గడ్డపైనే" అని పవన్ కల్యాణ్ వివరించారు.

## మార్చి 24, 25 తేదీల్లో బ్యాంకర్ల దేశవ్యాప్త సమ్మె.. ప్రకటించిన యూఎఫ్‌బీయూ..!




ఢిల్లీ: ఈ నెల 24, 25 తేదీల్లో రెండు రోజుల పాటు దేశవ్యాప్తంగా సమ్మె కొనసాగుతుందని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ప్రకటించింది. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ తో జరిగిన చర్చలు ఎలాంటి సానుకూల ఫలితాలను ఇవ్వకపోవడంతో సమ్మెపై నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. అన్ని కేడర్లలో నియామకాలు, వారంలో ఐదురోజుల పని తదితర డిమాండ్లపై చర్చించేందుకు యూఎఫ్‌బీయూ సభ్యులు ఐబీఏను కలిశారు. ఆయా డిమాండ్లపై ఎలాంటి సానుకూల నిర్ణయం తీసుకోలేదని నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయిస్ ప్రధాన కార్యదర్శి ఎల్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. తొమ్మిది బ్యాంక్ ఉద్యోగ సంఘాలతో కూడిన యూఎఫ్‌బీయూ ఇప్పటికే డిమాండ్లపై సమ్మె ప్రకటించింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉద్యోగి, ఆఫీసర్ డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయాలనే డిమాండ్ సైతం ఉన్నది. ఆర్థిక సేవల విభాగం ఇటీవలి సూచనలను ఉపసంహరించుకోవాలని సైతం యూఎఫ్‌బీయూ డిమాండ్ చేస్తున్నది. ఈ ఇన్‌స్ట్రక్షన్స్ ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు ముప్పు కలిగిస్తున్నాయని, ఉద్యోగులపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆరోపించారు. గ్రాట్యూటీ చట్టాన్ని సవరించాలని, పరిమితిని రూ.25లక్షలకు పెంచాలని, ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని యూఎఫ్‌బీయూ డిమాండ్ చేస్తున్నది. యునైటెడ్ ఫోర్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్‌లో ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ , ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ , నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ , ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన బ్యాంకుల సంఘాలు ఉన్నాయి.

## నామినేటెడ్ పదవులకు పేర్లను సిఫారసు చేయకుండా కొంతమంది నేతలు ఆలస్యం చేస్తున్నారు

మొదటి పేజి తరువాయి

దరఖాస్తు పంపిన మొదటిసారే పదవి రాలేదని అనుకోవద్దని, రెండేళ్ల పదవీకాలం ముగిశాక మిగతా వారికి అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే నామినేటెడ్ పదవులు తీసుకున్న వారి పనితీరును పర్యవేక్షిస్తున్నామని అన్నారు. నేతలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎంత హుందాగా ఉన్నారో, ఇప్పుడూ అంతే హుందాగా వ్యవహరించాలని సూచించారు. టీడీపీ నేతలు ఏ స్థాయిలోనూ వైసీపీ నేతలతో సంబంధాలు పెట్టుకోకూడదని స్పష్టం చేశారు. నేను ఈ విధంగా చెబుతుంటే... వైసీపీకి ఓటేసిన వారికి పథకాలు ఇవ్వొద్దు అన్నట్టుగా ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో వివక్ష ఉండదని ఉద్ఘాటించారు. పార్టీలకు అతీతంగా పథకాలు అందజేస్తున్నామని అన్నారు. సంక్షేమ పథకాలు వేరు, రాజకీయ సంబంధాలు వేరు అని వ్యాఖ్యానించారు. గ్రూపు రాజకీయాలకు తావివ్వకుండా చూసే బాధ్యత మంత్రులదేనని వివరించారు. జిల్లా ఇన్చార్జి మంత్రులు వారి జిల్లాల్లో పర్యటనల సంఖ్య పెంచాలని సూచించారు. కూటమిలోని మూడు పార్టీల నేతలను, కార్యకర్తలను కలుపుకుని ముందుకు వెళ్లాలని తెలిపారు.

## సునీతా విలియమ్స్‌ను భూమి మీదకు ఎప్పుడు తీసుకువస్తారో తెలుసా?

ఢిల్లీ: సునీతా విలియమ్స్, బుచ్ విల్ మోర్ ను అంతరిక్షం నుంచి భూమి మీదకు తీసుకువచ్చే క్రూ 10 మిషన్ ను మార్చి 14న ప్రారంభించనున్నారు. రెండు రోజుల క్రితం సునీతా విలియమ్స్ ను అంతరిక్షం నుంచి తీసుకువచ్చేందుకు క్రూ-10 మిషన్ చివరి నిమిషంలో రద్దైంది. మార్చి 12న అమెరికా ఫ్లోరిడా నుంచి ఫాల్కన్ 9 రాకెట్ బయలుదేరే ముందు టెక్నికల్ సమస్య తలెత్తింది. దీంతో స్పేస్ ఎక్స్ క్రూ 10 మిషన్ వాయిదా పడింది. క్రూ 10 మిషన్ అమెరికా కాలమానప్రకారం మార్చి 13 రాత్రి ఏడుగంటలకు ప్రారంభం కానుంది. అదే భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం నాలుగున్నర గంటలకు ఈ మిషన్ ప్రారంభం కానుంది. బోయింగ్ స్టార్ లైనర్ వ్యోమనౌకలో సునీతా విలియమ్స్, బుచ్ విల్ మోర్ 2024 జూన్ 6న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. విమానాల్లో ఇతర దేశాలకు వెళ్లినట్టే అంతరిక్షానికి వ్యోమనౌకలో వెళ్లే ప్రయోగంలో భాగంగా ఈ ఇద్దరు వ్యోమగాములు ఎనిమిది రోజుల పాటు అంతరిక్షంలో ఉండి తిరిగి భూమి మీదకు రావాలనేది షెడ్యూల్. స్టార్ లైనర్ వ్యోమనౌకలో సాంకేతిక సమస్యలు రావడంతో ఈ ఇద్దరూ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోనే ఉన్నారు. వీరిని అంతరిక్షానికి తీసుకెళ్లిన స్టార్ లైనర్ 2024 సెప్టెంబర్ లో భూమి మీదకు తిరిగి వచ్చింది. క్రూ-10 మిషన్ సక్సెస్ అయితే సునీతా విలియమ్స్, విల్ మోర్ అంతరిక్ష కేంద్రం నుంచి 2025 మార్చి 20 న అంతరిక్ష కేంద్రం నుంచి భూమి మీదకు తిరిగి వస్తారు.

## చంద్రబాబు, పవన్ కల్యాణ్ నా బాధ్యతను మరింత పెంచారు

అమరావతి: జనసేన నాయకుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోదరుడు కొణిదెల నాగబాబు ఏపీ శాసనమండలిలోకి అడుగుపెట్టబోతున్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా గెలుపొందారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా నాగబాబు స్పందిస్తూ... తాను ఎమ్మెల్సీ అయ్యేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన బాధ్యతను మరింత పెంచారని చెప్పారు. ప్రభుత్వ పాలనలో ప్రజాసేవ చేసేందుకు తనను ఎమ్మెల్సీ చేసిన చంద్రబాబు, పవన్ లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. తనతో పాటు ఎమ్మెల్సీలుగా ఎన్నికైన బీద రవిచంద్ర, సోము వీర్రాజు, గ్రీష్మ ప్రసాద్, తిరుమల నాయుడులకు శుభాకాంక్షలు తెలుపుతున్నానని నాగబాబు అన్నారు. నామినేషన్ దాఖలు చేసే సందర్భంగా తనతో పాటు ఉన్న మంత్రులు నాదెండ్ల మనోహర్, నారా లోకేశ్, విష్ణుకుమార్ రాజు, కొణతాల రామకృష్ణలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇన్నేళ్ల తన రాజకీయ ప్రయాణంలో తనతో కలిసి పని చేసిన సహచరులకు, మిత్రులకు, మీడియా ప్రతినిధులకు... ముఖ్యంగా జనసేన పార్టీ నేతలు, జనసైనికులు, వీర మహిళలు, మొత్తం జనసేన కుటుంబానికి ఆత్మీయ అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. మరోవైపు నాగబాబును మంత్రిని చేస్తామని గతంలోనే చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే.

## స్టాలిన్ ప్రభుత్వంపై నిర్మలా సీతారామన్ ఫైర్

ఢిల్లీ: తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం రూపీ సింబల్‌ను మార్చడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది విభజనవాదానికి దారి తీస్తుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు సొంత రూపీ సింబల్ అంటున్నారని, రానురాను సొంత మిలిటరీ, సొంత దేశం అని కూడా అనొచ్చని చెబుతున్నారు. కేంద్రంతో వివాదం ఉంటే దేశం మొత్తానికి వర్తించే రూపీ సింబల్ మార్చడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. తమిళనాడు బడ్జెట్ పత్రాల్లో రూపీ(?) గుర్తును తొలగించి రూ. అనే అక్షరాన్ని చేర్చడంపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఫైరయ్యారు. 2010లో కేంద్రం రూపీ సింబల్‌ను ఆమోదించిన సమయంలో ఎందుకు వ్యతిరేకించలేదని స్టాలిన్ సర్కారును ప్రశ్నించారు. ఇప్పుడు ఈ గుర్తును తిరస్కరించి తమిళ యువత సృజనాత్మకతను విస్మరించారని మండిపడ్డారు. కాగా రూపీ(?) గుర్తును డిజైన్ చేసింది డీఎంకే నేత కుమారుడు ఉదయ కుమార్ కావడం గమనార్హం. దివంగత ఆర్థిక మంత్రి ప్రణబ్ 2009 కేంద్ర బడ్జెట్ సమయంలో రూపాయికి గుర్తు సూచించాలని ఓపెన్ కాంపిటిషన్ ప్రకటించారు. 3331 డిజైన్లలో 5 షార్ట్ లిస్ట్ చేసి డీఎంకే మాజీ ఎమ్మెల్యే కుమారుడు, ప్రొఫెసర్ ఉదయ్ పంపినది ఎంపిక చేశారు. ఇది దేవనాగరి లిపి ? ' 'ra',, లాటిన్ ఇంగ్లిష్‌లో నిలువు గీత లేని Rను పోలి ఉంటుంది. r లో 2 సమాన అడ్డగీతలు అసమానతల్లేని సంపద పంపిణీని సూచిస్తాయి. తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం రూపీ సింబల్‌ను మార్చడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది విభజనవాదానికి దారి తీస్తుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు సొంత రూపీ సింబల్ అంటున్నారని, రానురాను సొంత మిలిటరీ, సొంత దేశం అని కూడా అనొచ్చని చెబుతున్నారు. కేంద్రంతో వివాదం ఉంటే దేశం మొత్తానికి వర్తించే రూపీ సింబల్ మార్చడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

## ప్రధాని మోదీకి థ్యాంక్స్ చెప్పిన పుతిన్

మాస్కో: ఉక్రెయిన్, రష్యా మధ్య శాంతి నెలకొల్పేందుకు ప్రపంచ దేశాల నేతలు చేస్తున్న ప్రయత్నాలపై వ్లాదిమిర్ పుతిన్ స్పందించారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని మోదీలకు ఆయన థ్యాంక్స్ తెలిపారు. ఉక్రెయిన్, రష్యా యుద్ధాన్ని ఆపేందుకు ట్రంప్, మోదీలు నోబెల్ మిషన్ చేపట్టినట్లు తెలిపారు. ఉక్రెయిన్‌తో 30 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరే అవకాశం ఉన్న నేపథ్యంలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. కాల్పుల విరమణపై చర్చలు చేపట్టేందుకు రష్యా సిద్ధంగా ఉందని, కానీ ఆ ఒప్పందానికి ముందు షరతులపై క్లారిటీ రావాలన్నారు. 2024 జూలైలో చేసిన ప్రతిపాదన ప్రకారం స్వల్పకాల పరిష్కారాలకు తాము అంగీకరించబోమని పుతిన్ పేర్కొన్నారు. కానీ యుద్ధ సంక్షోభాన్ని శాశ్వతంగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఉక్రెయిన్, రష్యా సమస్య పరిష్కారానికి అమెరికా ప్రతినిధులు కొన్ని రోజుల క్రితం సౌదీ అరేబియాలో భేటీ నిర్వహించిన విషయం తెలిసిందే. ఉక్రెయిన్ ప్రతినిధులతో నిర్వహించిన చర్చల్లో 30 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదన వచ్చింది. ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణ అంశంపై నిర్ణయం తీసుకోవడానికి ముందు.. వివిధ దేశాధినేతలకు థ్యాంక్స్ చెప్పాలనుకుంటున్నట్లు గురువారం పుతిన్ తెలిపారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు ట్రంప్ ఎంతో ప్రయత్నించారన్నారు. అన్ని దేశాలకు ఎన్నో సమస్యలు ఉన్నాయని, కానీ చైనా అధ్యక్షుడు, భారత ప్రధాని, బ్రెజిల్ అధ్యక్షుడు, సౌతాఫ్రికా అధ్యక్షుడు.. ఎంతో మంది దేశాధినేతలు.. ఉక్రెయిన్ సమస్య పరిష్కారం కోసం ఎంతో సమయాన్ని వెచ్చిస్తున్నారని పేర్కొన్నారు. శాంతి కోసం కృషి చేసినవారందరికీ థ్యాంక్స్ చెబుతున్నట్లు పుతిన్ తెలిపారు. ఓ మంచి లక్ష్యం కోసం నేతలందరూ పనిచేస్తున్నారని, యుద్ధాన్ని నివారించేందుకు ప్రయత్నిస్తున్నారని, ప్రాణ నష్టం జరగకుండా చూస్తున్నారని పుతిన్ తెలిపారు. దీర్ఘకాలిక శాంతి ఏర్పడే అవకాశం ఉంటేనే.. ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరిస్తామని పుతిన్ చెప్పారు. ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలైన తర్వాత ప్రధాని మోదీ పలు మార్లు పుతిన్, జెలెన్‌స్కీతో మాట్లాడారు. గత నెలలో వైట్‌హౌజ్‌లో ట్రంప్‌తోనూ ఈ అంశంపై మోదీ భేటీ అయ్యారు. రష్య, ఉక్రెయిన్ సంక్షోభంలో భారత్ తటస్థంగా ఉన్నట్లు చెప్పారు. ఇది యుద్ధం జరిపే యుగం కాదు అని, ట్రంప్ తీసుకునే చర్యను సమర్థిస్తున్నట్లు కూడా మోదీ పేర్కొన్నారు.


## పల్నాడు కేంద్రంగా రంగంలోకి జగన్

మొదటి పేజి తరువాయి

తానే స్వయంగా రంగంలోకి దిగాలని నిర్ణయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జగన్ ప్రతిపక్ష పాత్ర సమర్థవంతంగా నిర్వ హించేందుకు సిద్దం కావాలని పార్టీ కేడర్ కు పిలుపునిచ్చారు. ప్రభుత్వం హామీల అమలు చేయక పోవటాన్ని ప్రశ్నిస్తున్నారు. తాజాగా బడ్జెట్ కేటాయింపుల పైన జగన్ స్పందించారు. కూటమి నేత లపైన తన పోరాట తీవ్రతను పెంచాలని నిర్ణయించారు. అందులో భాగంగా త్వరలో జిల్లాల పర్య టనలకు జగన్ సిద్దం అవుతున్నారు. ఉగాది తరువాత జిల్లాల టూర్ ప్రారంభం కానుంది. ఈ లోగా పార్టీలో పెండింగ్ పదవులను భర్తీ చేయనున్నారు. కీలక నేతల బాధ్యతలను మార్పు చేయాలని జగన్ ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఇదే సమయంలో పల్నాడు కేంద్రంగా జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. జగన్ భరోసా మాజీ సీఎం జగన్ ను గురజాల నియోజకవర్గం మాచవరం మండలం పిన్నెల్లి గ్రామస్తులు కలి సారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాదాపు 400 మంది వైసీపీ సానుభూతిపరుల కుటుంబాలపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామ బహిష్కరణ వేటు వేసిందని జగన్ కు వివరించారు. అందులో ఎక్కువ శాతం మైనారిటీ, ఎస్సీ, బీసీలకు చెందిన వారేనని చెప్పు కొచ్చారు. ఈ వివాదం పైన ఇప్పటికే కోర్టుకు వెళ్లినట్లు తెలిపారు. వీరికి జగన్ భరోసా ఇచ్చారు. వారు చేస్తున్న న్యాయ పోరాటానికి అండగా నిలుస్తామని చెప్పారు. గ్రామ బహిష్కరణకు గురైన బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రతీ బాధిత కుటుంబానికి పార్టీ నుంచి పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. ఇదే సమయంలో త్వరలోనే ఛలో పిన్నెల్లి నిర్వహిస్తామని జగన్ వెల్లడించారు. పార్టీ శ్రేణులతో కలిసి పిన్నెల్లి గ్రామానికి బాధితులను తీసుకొని వెళ్తామని చెప్పుకొచ్చారు. జగన్ ను కలిసిన వారిలో పిన్నెల్లి గ్రామంతో పాటుగా తురకపాలెం, మాదెనపాడు,చెన్నాయపాలెం గ్రామాలకు చెందిన మరికొంత మంది ఉన్నారు. దీంతో.. జగన్ తాజా నిర్ణయం పార్టీలో సంచలనంగా మారింది. 2019 ఎన్నికల్లో పల్నాడులో వైసీపీ క్లీన్ స్వీప్ చేసింది. 2024 ఎన్నికల్లో టీడీపీ అన్ని సీట్లను కైవసం చేసుకుంది. ఇక, ఇప్పుడు మారుతున్న సమీకరణాలతో జగన్ తీసుకున్న తాజా నిర్ణయంతో పల్నాడు జిల్లాలో రాజకీయంగా మరోసారి వేడెక్కుతోంది. జగన్ జిల్లాల పర్యటన పైన వచ్చే వారం కీలక ప్రకటనకు కసరత్తు జరుగుతోంది.

## పవన్ కంగ్రాట్స్ అన్న లోకేష్!

మొదటి పేజి తరువాయి



ఆద్యంతం నామినేషన్ కార్యక్రమంలో ఉండి మిత్ర పక్షం అంటే ఎంత ప్రేమ ఉందో చాటుకున్నారు. ఇక వైసీపీ వారు పవన్ మీద ఏమైనా విమర్శలు చేస్తే జనసేన నేతలు కంటే ఎక్కువగా లోకేష్ రియాక్ట్ అవుతున్నారు. పవన్ ని ఏమైనా అంటే చూస్తూ ఊరుకునేది లేదని కూడా గట్టిగా వార్నింగ్ ఇచ్చేశారు. ఇవన్నీ పక్కన పెడితే మార్చి 14న జనసేన ఆవిర్భావ దినోత్సవం. పిఠాపురంలో అంతా పండుగ వాతావరణం కనిపిస్తోంది. ఎటు చూసినా జనసేన బ్యానర్లు పవన్ కల్యాణ్ ఫ్లెక్సీలతో సందడి చేస్తోంది. ఇక ఏపీ వ్యాప్తంగా జనసేన మీటింగ్ గురించే చెప్పుకుంటున్నారు. ఇలా మిత్రపక్షం ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా మంత్రి నారా లోకేష్ జనసేనాని అయిన పవన్ కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ మేరకు లోకేష్ చేసిన ఈ ట్వీట్ తెగ వైరల్ అవుతోంది. ఏపీ అభివృద్ధిపై జనసేన నిబద్ధత ప్రశంసనీయమని ఈ సందర్భంగా నారా లోకేష్ కొనియాడారు. అంతే కాదు రాష్ట్ర ప్రగతి కోసం ప్రజా సంక్షేమం కోసం జనసేన చేస్తున్న కృషి అందరికీ స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. సరైన సమయంలో లోకేష్ వేసిన ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. జనసేన మీద పవన్ మీద లోకేష్ తనకు ఉన్న సాఫ్ట్ కార్నర్ ని అలా చాటుకున్నారని అంటున్నారు. పవన్ కళ్యాణ్ ని అన్న అని సంభోదిస్తూ వస్తున్న లోకేష్ ఈ బంధాన్ని శాశ్వతం చేసుకోవాలని చూస్తున్నారు. జనసేనతో మరింత బలమైన బంధాన్ని ఆయన కోరుకుంటున్నారు. పవన్ సైతం మరో మూడు టెర్ములు ఏపీలో టీడీపీ కూటమి అధికారంలో ఉండాలని కోరుకున్నారు. దానికి తగినట్లుగానే లోకేష్ నుంచి ఈ విధంగా స్పందన వస్తోంది. దీంతో ఏపీలో టీడీపీ కూటమి బంధం మరింత దృఢతరం అవుతోంది. నానాటికీ పటిష్టం అవుతోంది. ఇదే విధంగా ముందుకు సాగితే మాత్రం ఏపీ పాలిటిక్స్ లో కూటమికి ఎదురు ఉండదని అంటున్నారు.

## బంగారు భవితకు పదో తరగతి పునాది - పరీక్షల వేళ.. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ



రెంటచింతల,మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : ఏఎస్ డబ్ల్యూవో గురజాల పరిధిలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలలో పదో తరగతి అభ్యసిస్తున్న 110 మంది విద్యార్థినీ విద్యార్థులకు స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పరీక్ష ప్యాడ్లు, రిస్ట్ వాచ్ లు పంపిణీ చేశారు. ఏఎస్ డబ్ల్యూవో టి వి సుజాత కుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పరీక్ష ప్యాడ్లను స్థానిక స్టేట్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు నాయక్, పెద్ది ప్రభావతి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మారుతి నాగార్జున, సత్యవతి దంపతుల సహకారంతో రిస్ట్ వాచ్ లు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్ డబ్ల్యూవో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రమం తప్పకుండా శ్రమిస్తే కష్టానికి తగ్గ ఫలితం వస్తుందని, విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించటానికి బంగారు భవితకు పునాది వంటిదైన పదో తరగతి పరీక్షలు బాగా రాసి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వార్డెన్లు జె అరుణ కుమారి,నూరుల్లా బేగ్, గోపాల్ నాయక్, మాధవి లత, శిరోమణి, రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మార్కిస్టు సిద్ధాంత వేత్త కారల్ మార్క్స్ 142వ వర్ధంతి




శుభోదయం న్యూస్, బాపట్ల జిల్లా: కౌలు రైతులు,సన్న,చిన్నకార రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వకుండా రైతుల శ్రమని కార్పొరేట్ వ్యాపార వర్గాలు దోచుకుంటున్నాయని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ అన్నారు. 14/3/2025 శుక్రవారం శ్రమజీవులతో కలిసి కారల్ మార్క్స్ 142వ వర్ధంతిని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో డ్రైవర్స్ కాలనీలో నిర్వహించింది.ఈ సందర్భంగా మేకల ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ శ్రామిక వర్గ పక్షపాతి కార్ మార్క్స్ 158 సంవత్సరాల క్రితం క్యాపిటల్ మొదటి రచన పూర్తి చేసి కష్టజీవులకి అండగా నిలిచిన శ్రామిక వర్గ మేధావి కారల్ మార్క్స్ అని అన్నారు. సరుకులు అమ్మే పనిలో ప్రపంచీకరణ మార్కెట్ యువతి, యువకుల శ్రమని ఏ విధంగా దోచుకుంటుందో 141 సంవత్సరాల కిందటే గుర్తించిన మేధావి కారల్ మార్క్స్ అని అన్నారు. వీధుల్లో తిరిగి వివిధ వస్తువులు అమ్ముతూ బ్రతుకుతున్న వివిధ మానవ సమూహాలు,సంచార జాతులు దుస్థితి ఆన్లైన్ మార్కెట్ వలన ఆగమైపోతున్నాయని అన్నారు.అమెజాన్, రిలయన్స్ డీమార్ట్,బెస్ట్ ప్రైస్ లాంటి బహుళజాతి వ్యాపార సంస్థలు మినీ కిరాణా వ్యాపారుల బ్రతుకులని ధ్వంసం చేస్తున్నాయని అన్నారు. నిరుపేద కుటుంబాలు కార్పొరేట్ విద్యను కొనలేకపోతున్నాయని అన్నారు. వ్యవసాయ రంగంలో ఉపాధి లభించక కష్టజీవులు వలసలు పోతున్నారని అన్నారు. వివిధ రంగాలలో ఉపాధి పొందే కార్మికులకు ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ వలన ఉపాధి లేకుండా పోయింది అని అన్నారు. ప్రపంచీకరణ ప్రైవేటీకరణలకు వ్యతిరేకంగా శ్రామిక ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం బాపట్ల మండల నాయకులు పి.పోలమ్మ .ప్రగతిశీల మహిళా సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు జె. కల్పన, పి.లక్ష్మి. ప్రగతిశీల యువజన సంఘం నాయకులు ఎస్ డి హఫీజ్, వి.విజయ్ ఇంటి పని వంట పని కార్మిక సంఘం నాయకులు ఎస్.కె బాజిద తదితరులు పాల్గొన్నారు.

## హెూలీ పండుగ సందర్భంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పటిష్ట బందోబస్తు



నంద్యాల/ రిపోర్టర్ మోహన్ (శుభోదయం న్యూస్): అన్ని పోలీస్ స్టేషన్ ల పరిధిలో నేడు హెూలీ పండుగ సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడంతో పాటు నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్.యుగంధర్ బాబు మరియు నంద్యాల సబ్ డివిజన్ ఎ ఎస్ పి మంద. జావళి ఆల్ఫోన్స్ నంద్యాల పట్టణంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ లోని సీసీ కెమెరాల ద్వారా బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ రంగుల పండుగ మన జీవితాల్లో ఆనందం, శాంతిని నింపాలన్నారు. హెూలీ పండుగను శాంతియుతంగా, సామరస్యంగా జరుపుకోవాలని, ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా, హాని కలిగించకుండా రంగులు చల్లుకోవాలన్నారు. సహజ సిద్ధమైన, ఆరోగ్యానికి హాని చేయని రంగులను మాత్రమే వాడాలని, రసాయన రంగులకు దూరంగా ఉండాలన్నారు. మహిళల పట్ల గౌరవంగా ఉండాలని,అసభ్యకరంగా ప్రవర్తించకుండా, వారిని ఇబ్బంది పెట్టకుండా, పండుగను జరుపుకోవాలని, నీటిని వృథా చేయకుండా, పర్యావరణానికి హాని కలిగించకుండా హెూలీని జరుపుకోవాలి. నంద్యాల పట్టణ కేంద్రంలోని గాంధీ చౌక్, కల్పనా సెంటర్, శ్రీనివాస్ సెంటర్ ,కొత్త మసీదు, విక్టోరియా రీడింగ్ రూమ్ ,ఓల్డ్ ఈద్గా ,చిత్తలూరి వీధి, ఆత్మకూరు బస్టాండ్, సంజీవనగర్ గేట్ , దబ్రాల మసీద్, మున్సిపల్ ఆఫీస్, పద్మావతి నగర్, ఎస్బిఐ కాలనీ, విశ్వ నగర్ ,ఎన్జీవోస్ కాలనీ, బ్యాంక్ కోచింగ్ సెంటర్ ,సాయిబాబా నగర్ మొదలగు ప్రాంతాలలో పికెట్స్ ఏర్పాటు చేయడంతో పాటు, బ్లూ కోర్స్ వాహనాలతో మూవింగ్ చేయడం మరియు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశారు.

## నెరవాటి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే శిల్పా మరియు మాజీ ఎంపీ పోచా



నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్): నంద్యాల పట్టణం పద్మావతినగర్ నందు నూతనంగా నిర్మించిన నెరవాటి మల్టీ స్పెషాలిటీ హాస్పెటల్ ను మాజీ ఎమ్మెల్యే శిల్పార విచంద్రకిషోర్రె రెడ్డి మరియు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నెరవాటి కుటుంబ సభ్యులకు, ప్రత్యేకంగా ప్రముఖ పారిశ్రామికవేత్త నెరవాటి సత్యనారాయణ, డా.నెరవాటి వినోద్ కుమార్, డా. నెరవాటి అరుణకుమారి, డా. సుమన్,డా. ఫాతిమాలకు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. నెరవాటి మల్టీ స్పెషాలిటీ హాస్పెటల్ నందు అందుబాటులో ఉన్న వైద్య సేవలను నంద్యాల జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్య రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిషోర్ రెడ్డి మరియు మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లా ప్రజలకు అందుబాటులో నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ నందు నూతనంగా 100 పడకల సామర్థ్యం ఉన్న మల్టీ స్పెషాలిటీ హాస్పెటల్ ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈఎన్టీ, ఇన్ఫర్టిలిటీ, గైనిక్, ఆర్థో తదితర స్పెషలైజేషన్ కలిగిన వైద్య సేవలను అందించడం జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చే సుకోవాలని కోరారు. మెట్రోనగరాలకు వెళ్ళ వలసిన అవసరంలే కుండా నంద్యాలలో వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం అన్నారు.

## బాధితులకు అండగా సీఎం సహాయనిధి



శుభోదయం న్యూస్, బాపట్ల జిల్లా: బాపట్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో బాపట్ల పట్టణం లోని అర్హులైన 6 మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల సహాయార్థం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ నిధి సీఎం రిలీఫ్ ఫండ్ నుండి వచ్చిన %జవీ=ఖీ% చెక్కులను లబ్ధిదారులకు బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ వేగేశన నరేంద్ర వర్మ రాజు గారు అందజేశారు.బాపట్ల పట్టణం దగ్గుమల్లివారి పాలెంకి చెందిన దాసరి మురళి కి రూ.1,01,707/-బాపట్ల పట్టణం రైలు పేటకి చెందిన షేక్ మస్తాన్ వలి కి రూ. 74,398/-బాపట్ల పట్టణం ఇమ్మడిశెట్టి వారి పాలెం కి చెందిన ఇమ్మడిశెట్టి మురళీకృష్ణ కి రూ. 56,365/- బాపట్ల పట్టణం చిల్లర గొల్లపాలెంకి చెందిన ఆవుల వెంకటేశ్వర్లు గారికి రూ 45,000/-బాపట్ల పట్టణానికి చెందిన అన్నవరం మాధవరావు కి రూ.42,000/-బాపట్ల పట్టణానికి చెందిన జి హరి ప్రకాష్ గారికి రూ.18,000/-మొత్తం కలిపి రూ.3,37,470/- చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ వైద్యశాలలో కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తుందని మెరుగైన వైద్య నిమిత్తం వివిధ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందిన బాధితులకు వారు చెల్లించిన నగదు రసీదులను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే విచారించిన అనంతరం క్షతగాత్రులకు ముఖ్యమంత్రి సహాయ నిధిని కూటమి ప్రభుత్వం అందిస్తుంది అన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని పరిరక్షించడంతోపాటు మెరుగైన సమాజాన్ని అందించాలనే ఆలోచన విధానంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని ఆయన సేవలు రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతున్నాయి అని అన్నారు.అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు.ముఖ్యమంత్రి సహాయ నిధి అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు,బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు కి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు మందపాటి ఆంధ్రేయ తెలుగుదేశం,జనసేన,బిజెపి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## నూతన పారిశ్రామిక చట్టంపై అవగాహన పెంచుకోవాలి



శుభోదయం న్యూస్: బాపట్ల జిల్లా: ఎం ఎస్ ఎం ఇఅసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కే ఎల్ ఎస్ రెడ్డి.నూతన పారిశ్రామిక విధానాలపై అవగాహన కలిగి ఉండి ప్రభుత్వం ఇచ్చే రాయితీలను, సహకారాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే పారిశ్రామిక రంగంలో అభివృద్ధిని సాధించవచ్చని %మీవీజు% ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె ఎల్ ఎస్ రెడ్డి వివరించారు. బాపట్ల తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో జరిగిన లీన్ ట్రైనింగ్ క్యాంపులో ముఖ్యఅతిథిగా విచ్చేసి పారిశ్రామిక రంగంలో వస్తున్న మార్పులను వాటిపై అవలంబించవలసిన విధానాలపై అవగాహన కల్పించారు... మరో ట్రైనర్ గా విచ్చేసిన ఇండస్ట్రియల్ సైకాలజిస్ట్ పిన్ని బోయిన శ్రీమన్నారాయణ మాట్లాడుతూ యువ పారిశ్రామికవేత్తలు తక్కువ పెట్టుబడి వ్యయంతో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి నాణ్యతతో కూడిన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి అధిక లాభాలను రాబట్టడానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ నుంచి విచ్చేసిన లీన్ ట్రైనర్ టీ మార్టిన్ పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ పథకాలను గురించి పొందవలసిన రాయితీల గురించి వివరించారు... ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ పి వీరయ్య, బాపట్ల జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మిశెట్టి రత్న గుప్తా, బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు పారిశ్రామికవేత్త ముప్పలనేని శ్రీనివాసరావు, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన బెటర్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు




శుభోదయం న్యూస్, బాపట్ల జిల్లా: బాపట్ల పట్టణం అంబేద్కర్ భవన్ లో ,బెటర్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్,ప్రారంభోత్సవం సందర్భంగా పట్టణంలోని బాలసదనం మరియు శారా ఫెయిత్ ఫౌండేషన్ విద్యార్థినీ,విద్యార్థుల మధ్య ట్రస్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగినది.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ట్రస్ట్ ట్రెజరర్ ఏపూరి బాబురావు మాట్లాడుతూ మా ట్రస్ట్ చిన్నపిల్లలు మరియు వృద్ధులకు సేవ చేయుటకు ఏర్పాటు చేయడం జరిగిందని,సమాజంలో ఎవరైతే ఆసరా లేని వారు ఉంటారో వారికి మా ట్రస్ట్ చేయూతనిస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పి.పురుషోత్తం మాట్లాడుతూ పిల్లలకు సేవ చేసేటువంటి అవకాశం అందరికీ రాదని,ఈ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు.ఫౌండర్ ప్రెసిడెంట్ సలగల ఎలీషా బాబు మాట్లాడుతూ ప్రజాసేవే పరమావధిగా 'బెటర్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్' పనిచేస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థినీ,విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని అందించడం జరిగింది. తదనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బడుగు కిషోర్,అడ్వకేట్స్ మధుబాబు,కిషోర్,యానాది హక్కుల పోరాట సమితి ప్రెసిడెంట్ తిరువీధుల శంకర ప్రసాద్, కాగిత కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో పాల్గొన్న ఎరిక్షన్ బాబు



దోర్నాల మండల రిపోర్టర్- ఆవులయ్య ( శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లా దోర్నాల మండలంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ జయకేతనం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్-చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన సైనికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ... జగన్ అక్రమంగా చంద్రబాబుని జైలులో వేసినప్పుడు జనసేన అధినేత చంద్రబాబుని జైల్లో పరామర్శించిన వెంటనే కూటమితో కలిసి పనిచేస్తామని, జగన్ గద్దె దింపుతామని ధైర్యంగా ఆనాడు ముందుకొచ్చారని, అదే స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసి డిప్యూటీ సీఎం గా ఉన్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా జనసేన కార్యకర్తలకు ఎరిక్షన్ బాబు శు భాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సింగరాయకొండలో జనసేన పార్టీ నియోజకవర్గ కార్యాలయం ప్రారంభం



సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య(శుభోదయం న్యూస్):- జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరాయకొండలో కొండేపి నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయం ఘనంగా ప్రారంభించబడింది. ఈ కార్యక్రమానికి జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు హాజరై విజయవంతం చేశారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ సీనియర్ నాయకులు అడుసుమల్లి సుధాకర్ మాట్లాడుతూ, పార్టీ కార్యకలాపాలను ప్రజలకు మరింత దగ్గర చేయడానికి, అందరికీ అందుబాటులో ఉండే విధంగా పోలీస్ స్టేషన్ ఎదురుగా నియోజకవర్గ స్థాయి జనసేన పార్టీ కార్యాలయం ఏర్పాటు చేశామని తెలిపారు.జనసైనికులు, వీర మహిళలు తమ ప్రాంత సమస్యలను గౌరవ మంత్రివర్యులు డోలా బాల వీరాంజనేయ స్వామి గారి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. జనసేన పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా, నియోజకవర్గ స్థాయిలో కార్యాలయం ఏర్పాటు చేయడం ద్వారా పార్టీ కార్యకర్తలకు మరింత సౌలభ్యం కల్పించనున్నట్లు తెలిపారు.

## జాతీయ సాహిత్య అకాడమీ అవార్డు పొందిన సింగరాయకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని గాయిత్రి.




సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్ ):-గ్రామీణ తీర ప్రాంత ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని తన విభిన్న ప్రతిభ తో తెలుగు సాహిత్య రంగం లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన పెండ్యాల గాయిత్రి జాతీయ సాహిత్య అకాడమీ అవార్డు పొందారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో తెలుగు ఉపాధ్యాయిని గా సరస్వతి సేవ అందిస్తూ తన స్వయం కృషి సహిత్యపై ఉన్న మక్కువ తో ఈ అవార్డు పొందడం అభినందనీయం అని సాహిత్య ప్రేమికులు కొనియాడుతున్నారు.ఈ నెల 7నుండి 12 వరకు ఢిల్లీ లో జాతీయ సాహిత్య అకాడమీ నిర్వహించి అవార్డు ప్రధాన కార్యక్రమానికి హాజరై ప్రతిభను ప్రకటించాలని వచ్చిన ఆహ్వానం మేరకు ఆమె షెడ్యూల్ ప్రకారం కార్యక్రమం లో పాల్గొంది. సాహిత్య అకాడమీ ప్రకటించిన విధంగా ఆమెని జాతీయ సాహిత్య అవార్డు వరించింది. పెండ్యాల గాయిత్రి విభిన్న ప్రతిభావంతులు. ఆమె తన కున్న సాహిత్యాభిమానం తో తెలుగు కవి, నవలా రచయిత, చిన్న కదా రచయిత,పద్య కవిగా, నాటక రచయిత, పద్య రచయితగా, తన ప్రతిభను చాటి జాతీయ స్థాయి గుర్తింపు సాధించింది. ఈమె రెండు నవలలు,50 కి పైగా చిన్న కథలు,గజల్స్ తో సహా 100 కి పైగా పద్యాలు,6 నాటకాలు, నాటికలు రచించి తన విభిన్న ప్రతిభను చాటి చెప్పారు. ఈ మెకి జాతీయ సాహిత్య అకాడమీ అవార్డు వరించడం పై సింగరాయకొండ సాహిత్య ప్రియులు, కవులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తు అభినందనలు తెలిపారు.

## గంట వెంకట రమణారెడ్డికి ఘన సన్మానం



దోర్నాల మండల రిపోర్టర్- ఆవులయ్య(శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం ఆంధ్ర ప్రదేశ్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ ఆశీస్సులతో దోర్నాల మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ గా రెండోసారి నియమించిన సందర్భంగా గంట వెంకటరమణారెడ్డిని పూలమాలలతో శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో పెద్ద బొమ్మలాపురం ఎంపీటీసీ 2 పొందుగల వెంకటరెడ్డి గాలి శ్రీనివాస్ రెడ్డి మరియు పడమటి పల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు అదేవిధంగా దోర్నాల మండల వైస్ ఎంపీపీ 2 దర్శనం నాగయ్య మరియు ఆయన ముక్కుల ఎస్సీ పాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని ఘనంగా సన్మానించారు.


## అంగరంగ వైభవంగా హెూటల్ డాల్ఫిన్ ప్రారంభోత్సవం



ఎర్రగొండపాలెం, మండల రిపోర్టర్ - నారాయణ (శుభోదయం న్యూస్): ఎర్రగొండపాలెం పట్టణములోని గవర్నమెంట్ వైద్యశాల ముందు హెూటల్ డాల్ఫిన్ శుక్రవారం నాడు ప్రారంభోత్సవం జరిగినది ఈ హెూటల్ అధినేత దగ్గుపాటి సాయి స్వరూప్ చింటూ అను వ్యాపారవేత ప్రారంభించినారు ఈ హెూటల్ ప్రారంభోత్సవానికి డి కిషోర్ బాబు రాముడు సాయి పాల్గొన్నారు.

## గిరిజన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు వేగవంతం చేయాలి

### పనులను పరిశీలించిన గూడూరి ఎరిక్షన్ బాబు



దోర్నాల మండల రిపోర్టర్- ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా పెద్దోర్నాల మండలం దోర్నాల మేజర్ పంచాయతీలోని అయినముక్కలలో 49 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న గిరిజన (%×ుణాూ%) మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ పనులను యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్-చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు గారు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, కాంట్రాక్టర్ లతో మాట్లాడి పనులలో జాప్యం జరగకుండా త్వరగతిన హాస్పిటల్ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని కోరారు. ఈ ఆసుపత్రి పూర్తి అయితే పశ్చిమ ప్రాంత గిరిజన ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో దోర్నాల మండలం తెలుగుదేశం పార్టీ కన్వీనర్ ఎరువ మల్లికార్జున రెడ్డి ఆంధ్రప్రదేశ్ టి న్ టి యు సి ప్రధాన కార్యదర్శి బట్టు సుధాకర్ రెడ్డి షేక్ మాబు వల్లభనేని కాశయ్య షేక్ మంజూర్ కడిమెట్ల శ్రీనివాస్ యాదవ్ అలాగే దోర్నాల మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అందరు పాల్గొన్నారు.

## కనిగిరి పట్టణంలోని

## 8వ వార్డులో అలీమస్జీద్ వద్ద మెడికల్ క్యాంప్ నిర్వహణ





కనిగిరి రిపోర్టర్ జి.ప్రసాదరావు (శుభోదయం న్యూస్): కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాల మేరకు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు.రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాసం ఉంటున్న నేపథ్యంలో ఆరోగ్య సమస్యలు ఏవైనా ఉంటే అలాంటి వారికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం సూపర్ వైజర్ ఉమా మహేశ్వరరావు ఏఎన్ఎం ఉమ, ఆశా కార్యకర్తలు మరియమ్మ, సుజాత,టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంషీర్ అహ్మద్, 8వ వార్డు అధ్యక్షుడు మస్తాన్ బాబు, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ మెంబర్ రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

## సాంత్వన సేవా సమితి ఆధ్వర్యంలో చెవిటి,

### మూగ పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ



సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్ ): సాంత్వన సేవా సమితి ఆధ్వర్యంలో చెవిటి, మూగ పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ. నిన్న శుక్రవారం చీమకుర్తిలోని ఎస్ కేఆర్ చెవిటి మూగ ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ జయ కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులైన విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ చేయడం చాలా సంతోషకరంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధులు ఏ. ప్రేమ్ కుమార్, ఏలీయా, రాధ, జయమ్మ ,ఆశ్రమ పాఠశాల చైర్మన్ ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేధిద్దాం - పర్యావరణాన్ని కాపాడుదాం

### మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్): కనిగిరి పట్టణంలోని కపిల లాడ్జి సెంటర్ నందు గల మురుగు కాలవలలో ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు కాలవలలో వేయడం వలన మురుగునీటికి అడ్డుపడి కాలవలో పారుతున్న నీరు రోడ్డుపైకి వచ్చి దుర్వాసన రావడంతో స్థానికులు స్థానిక చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ కు తెలియపరచగా వారు శుక్రవారం సందర్శించి మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు తీసివేసి కాలువలను నీరు పారే విధంగా చేయడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ మురుగు కాలువలను మురుగు నీరు పారె విధంగా చూడాలనే గాని కాలువలను డస్ట్ బిన్ లాగా వాడకూడదని ప్రజలకు సూచించారు.ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి హానికరమని తెలుసుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడడానికి ప్రయత్నించాలని తెలిపారు. ప్లాస్టిక్ నిషేధానికి మద్దతు ఇవ్వాలని, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు.భవితరాలకు బంగారు భవిష్యత్తును అందించాలంటే ప్లాస్టిక్ నివారణకు ప్రభుత్వాలు చేపట్టే కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యం అయ్యి ప్రస్తుతం ఉన్న ప్లాస్టిక్ భూతాన్ని తరిమి వేసినప్పుడే బంగారు భవిష్యత్ అందించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మాణిక్యారావు, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ రమేష్ బాబు,రత్తయ్య, నారాయణ, సుబ్బారావు, మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు - ఇంచార్జి దద్దాల



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని కనిగిరి ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు.శుక్రవారం పామూరు టౌన్ లో మాజీ ఎఎంసీ వైస్ చైర్మన్, పట్టణ అధ్యక్షులు షేక్ చాంద్ బాషా ఆధ్వర్యంలో పామూరు టౌన్ విరువూరు రోడ్డులో రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లింల కోసం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ అతిథిగా పాల్గొన్నారు.. సర్వమత సారం ఒక్కటేనని, మనుషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి, జడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య,జిల్లా ఉపాధ్యక్షులు, జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి,సీనియర్ నాయకులు కల్లూరి రామిరెడ్డి,వైస్ సర్పంచ్ మండల యూత్ అధ్యక్షులు యాదల సాయి కిరణ్,గట్లా విజయభాస్కర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి,జొన్నలగడ్డ గోవిందయ్య, ఎంపీటీసీ షేక్ అబ్దుల్,మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ గయాజ్ షేక్,మహమ్మద్ హుస్సేన్,కో-ఆప్షన్ షేక్ నాయబ్ రసూల్,ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం,వార్డు మెంబెర్ %వీ%80 నాయబ్ రసూల్,ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రీరామ్ శ్రీనివాసులు,సోషల్ మీడియా విభాగం అధ్యక్షులు మర్రి రాజు, సర్పంచ్ సైకం స్వర్ణ ఏడుకొండలు,షేక్ కాలేషా, చల్లా సుబ్బారావు, మద్దెల హరీష్,షేక్ రసూల్, షేక్ మీరా మొహిద్దీన్, షేక్ సిటిజన్ నాయబ్ రసూల్,షేక్ మస్తాన్,మన్నం మాధవ, చింతలపూడి మల్లికార్జున రెడ్డి,పాలేటి ప్రేమకుమార్,సోషల్ మీడియా సభ్యులు షేక్ నాయబ,షేక్ సుభాని,సానికొమ్ము వెంకటేశ్వర రెడ్డి,సర్పంచ్ నారాయణరెడ్డి, దేవిరెడ్డి వెంకటస్వామి రెడ్డి,ఈర్ల శ్రీను, కంటూ కేశవ, మోటు, ఇర్రి వెంకటేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంతకాలం ఈ వలసలు

## వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణమే మాకు దిక్కు



కనిగిరి రిపోర్టర్ జి.ప్రసాదరావు (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గ ప్రజలు దేశంలోనే నలుమూలన బతుకుదెరువు నిమిత్తము వలసలు ఎక్కువగా ఉంటాయి. అదే విధంగా మూగజీవులు కూడా ఎండాకాలం వస్తే నాగర్జునసాగర్ కాల్వ ప్రాంతమైన దర్శి తదితర నీటి ప్రాంతానికి పశువులు గొర్రెలు మేకలు వలస వెళ్లటం జరుగుతుంది ఇంకా ఎంతకాలం ఈ గోసా అంటూ స్థానిక రైతులు వాపోతున్నారు కనిగిరి ప్రాంతంలో ఫ్లోరైడ్ తో పాటు వర్షాలు కూడా సంవత్సరానికి 10 15 సార్లు వర్షం పడుతుంది ఈ ప్రాంతం కరువు ప్రాంతం కనుక అనేక ఇబ్బందులకు లోని మనుషులు తాగే దానికి కూడా నీరు ఉండదు. మూగజీవులను నీటి ప్రాంతానికి తీసుకెళ్లటం అక్కడనే రుతుపవనాలు వచ్చేంతవరకు నీటి ప్రాంతానికి ఆవులను గొర్రెలను మేకలను తీసుకుని వెళ్ళటం జరుగుతుంది రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజల గోడును విన్నవించుకుని తొందరగా వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తిచేయాలని రైతులు రైతు కూలీలు పేద ప్రజలు బడుగు బలహీన వర్గాలు ఎక్కువ శాతం ఉన్న కనిగిరి ప్రజలు కోరుకుంటున్నారు.

### సమాజ్ వాది పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

## ముఖ్య అతిథిగా సమాజ్వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు



కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాద్ రావు (శుభోదయంన్యూస్):కనిగిరి పట్టణంలోని షాదీఖానాలో సమాజ్ వాది పార్టీ కనిగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ నజీర్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సమాజ్ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ హాజరై ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేసి ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లా దీవెనలు ఎల్లవేళలా ప్రతి ఒక్కరి పైన ఉండాలని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో కొండేపి నియోజకవర్గ ఇన్చార్జ్ వంగే పురపు కార్తీక్ రాజు, విజయరామరాజు, చెరుకూరి చిన్న కాశయ్య, పొట్టేళ్ల మాలకొండయ్య, శ్యామ్ బాబు, పెన్నా అల్లురయ్య, దానయ్య, ఆగస్టీన్, మోహన్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

### నూతన వరుడుని ఆశీర్వదించిన ..మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): సిఎస్ పురం మండలం లోని రేగులచెలుక గ్రామానికి చెందిన పాడె పెంచలయ్య గారి కుమారుడు హరినారాయణ వివాహ వేడుక గురువారం రాత్రి జరిగింది. ఈ వివాహ వేడుక లో కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు పాల్గొని నూతన వరుడు హరినారాయణని ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఫేర్వెల్ డే సెలబ్రేషన్ కార్యక్రమం




దోర్నాల మండల రిపోర్టర్- ఆవులయ్య ( శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలం దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు, 2024-2025 విద్యా సంవత్సరం 10వ తరగతి చదువుతున్నటువంటి విద్యార్థులకు ఫేర్వెల్ డే సెలబ్రేషన్ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. పదవ తరగతి విద్యార్థులకు తొమ్మిదవ తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో జరిగిన వీడ్కోలు సభకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సురభి అనసూయదేవి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అనసూయ దేవి మాట్లాడుతూ కష్టపడి చదువు చదివి పబ్లిక్ పరీక్షలు చక్కగా రాసి మంచి మార్కులతో విజయం సాధించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులకు పాఠశాలకు




ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఉపాధ్యాయులు నాగమూర్తి విద్యార్థులలో చైతన్యము కలిగించేలా ఒక చక్కని గీతాన్ని ఆలపించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. సంవత్సరమంతా చదివిన చదువును గుర్తుపెట్టుకుని పరీక్షల్లో బాగా రాసి మంచి మార్కులు తీసుకురావాలని కోరారు. ఉపాధ్యాయులు కిరణ్ కుమార్ వెంకట శివ పి రామ నాయక్ లు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదివి మంచిగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ ఖాదర్ వలీ ఉపాధ్యాయులు పోలయ్య మిట్టి నాయక్ చంద్రమౌళి ఆవులయ్య ఆంజనేయులు విజయ మాణిక్యం లక్ష్మీనారాయణ చందు నాయబ్ రసూల్ నరేష్ రిబ్కా తదితరులు పాల్గొన్నారు. అనంతరము విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల తో ఆటపాటలతో విద్యార్థులు సరదాగా గడిపారు. విద్యార్థులకు భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మంటల్లో పడి గాయపడిన వ్యక్తి మృతి

రెంటచింతల, మండల రిపోర్టర్-శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): వంట వండుతుండగా చెలరేగిన మంటల్లో పడి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శనివారం వెలుగు చూసింది. మండలంలోని తుమ్మకోట గ్రామంలోని సుగాలి కాలనీలో ఉంటున్న బాణావత్ బిక్రు నాయక్ (35) మద్యం సేవిస్తూ అర్ధరాత్రి వేళ వంట చేస్తున్న క్రమంలో పొయ్యిలో చెలరేగిన మంటల్లో పడి తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్ర గాయాల పాలైన అతనిని చికిత్సకై తొలుత గురజాల ఆసుపత్రికి తరలించి, అటు పిమ్మట మెరుగైన చికిత్సకై గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి 20 సంవత్సరాల క్రితం వివాహం కాగా గత కొంతకాలంగా భార్యా భర్తలు దూరంగా ఉంటున్నారు. మృతుని 19 ఏళ్ల కుమారుడు ప్రసాద్ నాయక్ తల్లి దగ్గర ఉంటుండంతో అతని బాగోగులు తమ్ముడు మజ్జి నాయక్ చూస్తుంటాడు.

## జనం గుండెల్లో రలిగిన ఉద్యమం జనసేన

## డిప్యూటీ సీఎం పవన్ ప్రస్తానం నవశకానికి నాంది



శుభోదయం న్యూస్, బాపట్ల జిల్లా: అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు బాపట్ల జనసేన నాయకులు విన్నకోట సురేష్..పిఠాపురంలో జనసేన ఆవిర్భావ సభకు తరలిన బాపట్ల జనసైనికులు...విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ఉవ్వెత్తున ఎగసిన ఉత్సాహంతో జన సైనికులు యాత్రగా కదిలారు. ఆటుపోట్లను ఎదుర్కొని ఎదురు నిలిచిన తమ నాయకునికి అండగా నిలిచేందుకు ఉక్కు పిడికిలి బిగించారు. శుక్రవారం జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిఠాపురంలో నిర్వహించనున్న సభకు బారులు కట్టారు. బాపట్ల జనసేన నాయకులు, అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో బాపట్ల నుంచి భారీ సంఖ్యలో జన సైనికులు పిఠాపురం సభకు తరలి వెళ్లారు. తొలుత ఆవిర్భావ దినోత్సవం సభ పోస్టర్ ను విన్నకోట సురేష్, గుంట్టుపల్లి తులసి కుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూబీ ఆయన జనం గుండెల్లో నుంచి నిప్పుకణికలా ఉద్భవించిన పార్టీ జనసేన అని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక పార్టీ పుట్టిన రోజు మాత్రమే కాదని, ఒక ఆశయం, ఒక సంకల్పం, ఒక నూతన శకానికి నాంది పలికిన రోజని చెప్పారు. ప్రశ్నించడానికే పుట్టిన పార్టీ.. పాలించేలా ఎదిగినందుకు గర్వంగా ఉందన్నారు. సమాజంలో నెలకొన్న అసమానతలు, అవినీతి, అన్యాయాలను రూపుమాపడమే జనసేన లక్ష్యమని పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పించడం, రైతులకు న్యాయం చేయడం, మహిళలకు భద్రత కల్పించడం, పేదలకు విద్య, వైద్యం అందించడం కోసం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పని చేస్తున్నారని తెలిపారు. జనసేన పార్టీ కేవలం రాజకీయ పార్టీ మాత్రమే కాదని, ఇది ఒక ఉద్యమమని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసి కుమారి, సురేంద్ర బాపట్ల టౌన్ నాయకులు కారుమూరి అంజనేష్, మదసాని బాలాజీ, దాసరి వినోద్, తిరుమలశెట్టి సాగర్, టీడీపీ నాయకులు భీమా కోటేశ్వరరావు, కామిశెట్టి సాయి, పెద్ది నాగు, జనసేన నాయకులు, కార్యక్తలు తదితరులు పాల్గొన్నారు..

## వలిగొండలో ఘనంగా హెూలీ సంబరాలు





వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని శివసాయి ఫంక్షన్ హాల్లో శుక్రవారం హెూలీ సంబరాలు శ్రీ మార్కండేయ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ మార్కండేయ అసోసియేషన్ అధ్యక్షులు మిర్యాల భాస్కర్ మాట్లాడుతు ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడ హెూలీ వేడుకలో అసోసియేషన్ కుటుంబ సభ్యులందరితో కలసి జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వంగరి రమేష్, రాపోలు శ్రీనివాస్, గంజి వెంకటేశ్వర్లు, మిర్యాల వేంకటేశం, నామాల జగన్మోహన్, దొంత శ్యామ్, కిరణ్, పెండం విఘ్నేష్, రచ్చ మధు, యెలగందుల లెనిన్, మణి, రచ్చ సంతోష్, కె ఉమా శంకర్, చిందం భాను, గంజి గణేష్, మేన గణేష్, సి పరమేష్ , జి మనోహర్, పి రాజు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజలకు మంత్రి కొండ సురేఖ హెూలీ శుభాకాంక్షలు




పరకాల నియోజకవర్గం (శుభోదయం న్యూస్) : హెూలీ పండుగను పురస్కరించుకొని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భగవంతుడు ప్రసాదించిన ఈ జీవితాన్ని పండుగల ఆస్వాదించాలనే సందేశాన్ని హెూలీ పండుగ ఇస్తుందని మంత్రి అన్నారు. ప్రకృతి ప్రసాదించిన రంగులే మన జీవితంలోని పలు దశలను ప్రతిబింబిస్తాయని మంత్రి అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంట సంక్షేమ కాంతులు విరజిల్లాలని మంత్రి కొండా సురేఖ ఆకాంక్షించారు. హెూలీ పండుగను ప్రజలంతా జాగ్రత్తగా, సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

## పరకాలలో పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా హెూలీ సంబరాలు



పరకాల నియోజకవర్గం (శుభోదయం న్యూస్): కార్యక్రమంలో పాల్గొన్న పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీ సోదా రామకృష్ణ ఈరోజు పరకాల పట్టణంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన హెూలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు.బ్యాండ్ బ్యాజాల తోటి పరకాల బస్టాండ్ నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా బస్టాండ్ రాజధాని హెూటల్ వరకు ర్యాలీగా పరకాల పట్టణ ప్రజలకు కులమతాలకతీతంగా అందరికీ హెూలీ శుభాకాంక్షలు తెలియజేస్తూ రంగులు చల్లుకున్నారు.



పరకాల మున్సిపల్ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేసిన పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీ సోదా రామకృష్ణ రామకృష్ణ మాట్లాడుతూ వసంతానికి స్వాగతం పలుకుతూ వచ్చిన ఈ హెూలీ మీ జీవితంలో మరిన్ని రంగులు అద్దాలని.. ప్రతి ఒక్కరూ ఆనందోత్సవాల మధ్య రంగుల పండుగ సంబురాలను జరుపుకోవాలని కోరుకుంటూ పరకాల పట్టణ ప్రజలందరికీ హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొయ్యల శ్రీనివాస్,పరకాల ఎఎంసీ చైర్మన్ చందుపట్ల రాజు రెడ్డి, కుంకుమేశ్వర ఆలయ గుడి చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, మాజీ కౌన్సిలర్స్, సమన్వయ కమిటీ సభ్యులు, సోషల్ మీడియా వారియర్స్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఐ.యన్.టి.యు.సి అధ్యక్షులు కర్క నాగరాజుని సన్మానించిన రాచమల్ల శేఖర్ గౌడ్



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్,( శుభోదయం న్యూస్), మార్చి 14: ఇటీవల కూకట్ పల్లి నియోజకవర్గం ఐ. యన్.టి.యు.సి అధ్యక్షులుగా పదవి భాద్యతలు చేపట్టిన కార్మిక నాయకులు కర్కనాగరాజు ని తన కార్యాలయం లో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన యూత్ కాంగ్రెస్ నాయకులు రాచమల్ల శేఖర్ గౌడ్ మరియు మేడ్చల్ జిల్లా ఐ.యన్.టి.యు.సి ఉపాధ్యక్షుడు నర్సింహా యాదవ్.అనంతరం వారు మాట్లాడుతూ కార్మిక నేత దివంగత నేత పిజెఆర్ ను ఆదర్శనంగా తీసుకొని కార్మికుల సమస్యల పై నిరంతరం పోరాట చేస్తున్న కర్క నాగరాజు ఆధ్వర్యంలో కూకట్పల్లి నియోజకవర్గం లో ఐ.యన్.టి.యు.సి ని బలోపేతం చేస్తారని ఆశభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్, శ్రీనివాస్ గౌడ్,చక్రవర్తి, జగన్,కర్క మహేష్,రమేష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



## హెూలీ శుభాకాంక్షలు తెలిపిన డిసిసిఎస్టీ సెల్ చైర్మన్ వరంగల్ గుగులోత్ రవీందర్ నాయక్



తెలంగాణ స్టేట్ కడిదేల రామారావు ( శుభోదయం న్యూస్ ): పచ్చటి పొలాలకు, అందమైన జీవనానికి ప్రతీక అయిన హెూలీ పండుగను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక హెూలీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానుఈ రంగుల పండుగ మన జీవితాల్లో ఆనందాన్ని ఐక్యతను, ప్రేమను నింపాలని కోరుకుంటున్నాను. సత్సంగతి, శుభాభివృద్ధి మరియు సంతోషంతో మీరు మీ లక్ష్యాలతో మరొక మెట్టు ఉన్నతంగా ఎదగాలని ఆశిస్తున్నానుసంక్షేమం, అభివృద్ధి మరియు ప్రజాసేవకు నిత్యం అంకితమై ఉన్న నాకు, మీ అందరి మద్దతు, ఆశీస్సులు ఎప్పుడూ అందించాలని కోరుకుంటూ, మీకు మరియు మీ కుటుంబ సభ్యులకు మరోసారి హెూలీ పండుగ శుభాకాంక్షలు.

## శ్రీ విద్యాధరి క్షేత్రంలో... అడిషనల్ కలెక్టర్ గరీమ అగర్వాల్ ప్రత్యేక పూజలు కుమారుడు రిషాన్ కు అన్నప్రాసన



వర్గల్ మండల రిపోర్టర్ విష్ణువర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్) సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమ అగర్వాల్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తన కుమారుడు రిశాన్ కు అన్నప్రాసన చేయించగా, వేద పండితులు గరీమ అగర్వాల్, పల్లవ్ దంపతులకు తీర్థప్రసాదాలు అందజేసి శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు.

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సస్పెన్షన్ ను తక్షణమే ఎత్తివేయాలి రామగుండం మాజీ ఎమ్మెల్యే, బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్



రామగుండం మండలం రిపోర్టర్ - తిరు,(శుభోదయం న్యూస్) శాసనసభలో ప్రజాస్వామ్య విలువలకు పాతరేస్తూ, నిరాధార ఆరోపణలతో మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేయడం దారుణమని రామగుండం మాజీ ఎమ్మెల్యే బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. రాష్ట్ర ప్రజలు, రైతులు, వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీసిన జగదీశ్ రెడ్డిని సభ నుండి సస్పెండ్ చేయడం అంటే ప్రశ్నించే గొంతుకను నొక్కే ప్రయత్నమే అన్నారు. జగదీశిరెడ్డిని ఉద్దేశపూర్వకంగా సభ నుంచి సస్పెండ్ చేశారని స్పీకర్ పట్ల జగదీష్ రెడ్డి అగౌరవంగా మాట్లాడలేదని అనని మాటను అన్నట్టుగా చిత్రీకరించారు. నిబంధనలకు విరుద్ధంగా సభలో ఏమీ మాట్లాడకపోయినా ఈ సమావేశాలు పూర్తయ్యే వరకు ఆయ న్ను సస్పెండ్ చేయడం దారుణం అన్నారు.మాజీ మంత్రి జగదీష్ రెడ్డి సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

## రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ - మనాలి ఠాకూర్ దంపతుల పెళ్లి రోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం

**49వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ సన ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో**



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్) గోదావరిఖనిలో శుక్రవారం రోజున పెళ్లి రోజు జరుపుకుంటున్న ఆదర్శ దంపతులైన రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మనాలి ఠాకూర్ దంపతుల పెళ్లి రోజు సందర్భంగా 49 వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ హాజ్ కమిటి సభ్యులు అయిన శ్రీ సన ఫకృద్దీన్ గారి ఆధ్వర్యంలో అమ్మ పరివార్ ఆశ్రమం లో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అయిన అతర్ పాషా,శ్రీకర్, ప్రసాద్, షాహేద్, కిషోర్, అజ్జు, షాదాఫ్, కలిమ్ పాల్గొన్నారు

## కుసంగిలో హెూలీ సంబరాలు




టేక్మాల్ మండలం రిపోర్టర్ కృష్ణ (శుభోదయం న్యూస్) టేక్మాల్ మండలం కుసంగి గ్రామంలో యువకులు మరియు చిన్న పిల్లలు కలిసిమెలిసి హెూలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు ఒకరికొకరు రంగులు చల్లుకొని హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు రసాయనాలు కలిపిన రంగులు వాడకుండా సహజ సిద్ధమైన రంగులతో హెూలీ పండుగ అంగరంగ వైభవంగా జరుపుకున్నారు

## మాజీ మంత్రి జగదీష్ రెడ్డిని సభ నుండి సస్పెండ్ చేయడం రాజ్యాంగ విరుద్ధం బి ఆర్ ఎస్ వి ములుగు జిల్లా నాయకులు దుర్గం రాజ్ కుమార్



మంగపేట, మండల రిపోర్టర్ - తులసి (శుభోదయం న్యూస్): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో బి ఆర్ ఎస్ వి ములుగు జిల్లా నాయకులు దుర్గం రాజ్ కుమార్మాట్లాడుతూ గురువారం జరిగిన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలలో బి ఆర్ ఎస్ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిని సభ నుండి సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఖునీ చేస్తుంది. బయట ప్రశ్నిస్తే అక్రమ కేసులు, అరెస్టులు, శాసనసభలో మాట్లాడితే కనీసం మైక్ కూడా ఇవ్వకుండా గొంతు నొక్కడం, సస్పెండ్ చేస్తా ఉంది ఈ ప్రభుత్వం. శాసనసభ చరిత్రలో ఇది ఒక చీకటి రోజుగా చెప్పుకోవచ్చు అని అన్నారు. సభలో ప్రతిష్టంభన ఏర్పడితే అన్ని పక్షాల అభిప్రాయాలను తీసుకుంటారు, అన్ని పక్షాలను పిలిపించి స్పీకర్ మాట్లాడతారు కానీ దానికి విరుద్ధంగా ఇక్కడ ఏ పక్షాల అభిప్రాయాలు తీసుకోకుండా కేవలం నలుగురు కాంగ్రెస్ పార్టీ సభ్యులను మాట్లాడించి “మూడ్ ఆఫ్ ద హౌస్” అని చెప్పి బిఆర్ఎస్ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. సభలో అన్ని ప్రతిపక్ష పార్టీలు ఉండగా ఎవరి అభిప్రాయాలు తెలుసుకోకుండా అధికారపక్షం ఇష్టానుసారంగా వ్యవహరించడం సిగ్గుచేటని మండి పడ్డారు. వాస్తవాలను పరిగణలోకి తీసుకుంటే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలనను ప్రజలు జీర్ణించుకోవడం లేదు ఇప్పటికే ప్రజలు ప్రభుత్వాన్ని తిడుతున్నారు. ప్రజలు కాంగ్రెస్ పాలనను ఏవగించుకుంటున్నారు, ఈసడించుకుంటున్నారు. ప్రజల యొక్క కష్టాలను బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎత్తిచూపుతారని భయంతోనే బిఆర్ఎస్ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ని సస్పెండ్ చేశారు. అలాగే బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు మాజీ మంత్రులు, ప్రధాన ప్రతిపక్షాల గొంతు నొక్కడం రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేకుండా పోయిందని ఆయన అన్నారు. అసలు జగదీశ్ రెడ్డి ఏమడిగిండు సభలో న్యాయం అడిగాడు, మా హక్కులు కాపాడమని అడగడం తప్పా... హక్కులు కాపాడమంటే సస్పెండ్ చేస్తారా... ఇదేనా ప్రజాస్వామ్యం అంటూ బి ఆర్ ఎస్ వి ములుగు జిల్లా నాయకులు దుర్గం రాజ్ కుమార్ తీవ్రంగా ఖండిస్తూ మన దేశ రాజ్యాంగం లో ఏక వచనం మాట్లాడితే సస్పెండ్ చేయమని రాజ్యాంగంలో ఎక్కడైనా ఉందా.... జగదీశ్ రెడ్డి వాడని ఏక వచనాన్ని వాడినట్లు చిత్రీకరించి ఏక పక్ష నిర్ణయం తీసుకొని ఎంతవరకు కరెక్ట్ అని మండిపడ్డారు. ఒక వేళ ఏక వచనం వాడినాగానీ భారత రాజ్యాంగం లో గానీ, మన శాశన సభ రూల్స్ బుక్ లో గానీ ఎక్కడ కూడా చెప్పబడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కావాలనే జగదీశ్ రెడ్డి ని సస్పెండ్ చేసి ప్రధాన ప్రతిపక్షం గొంతు నొక్కే ప్రయత్నం చేస్తుంది ఈ ప్రభుత్వం అని దుయ్య బట్టారు. అసలు జగదీశ్ రెడ్డి ప్రసంగం ప్రారంభం చేయగానే ప్రభుత్వ పని తీరును ఎక్కడ ప్రశ్నిస్తారో అనే ఒక కక్ష్య పూరిత ధోరని నే అవాలంభించింది కాంగ్రెస్ ప్రభుత్వం. రైతు బంధు ఇవ్వలేదు, రుణ మాఫీ ఇవ్వలేదు, వృద్దులకు పెన్షన్ 4000 వేలు ఇవ్వలేదు, రాష్ట్రంలో ఒక పక్క పంటలు ఎండిపోతున్నాయ్, కరెంట్ కోతల వలన లో వోల్టేజ్ తో మోటార్లు కాళీ పోతున్నాయ్, రైతులు రోడ్లు ఎక్కుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానీ తనంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా నది జలాలను కుడా తరలించుకు పోయి మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో పంటలెండిపోతున్నాయి. 33 రోజులు దేవాదుల మోటార్లు ఆన్ చేయక వరంగల్ జిల్లా లో లక్షలాది ఎకరాలు పంటఎండుతున్నాయి ఇలాంటి వన్ని బయటికి వస్తాయని, వీటికి కాంగ్రెస్ ప్రభుత్వం కు సమాధానం చెప్పే చేత గాక, బి ఆర్ ఎస్ ప్రశ్నిస్తుందనే ఉద్దేశ్యం తో, భయంతో నే బి ఆర్ ఎస్ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ని సస్పెండ్ చేసింది ఈ ప్రభుత్వం అని బి ఆర్ ఎస్ వి ములుగు జిల్లా నాయకులు దుర్గం రాజ్ కుమార్ ప్రశ్నించారు. జగదీశ్ రెడ్డి ని సస్పెండ్ చేయడం వెంటనే ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇట్టి సస్పెండ్ ను తీవ్రంగా ఖండిస్తూ కన్నాయిగూడెం మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు జగదీశ్ రెడ్డి గారి సస్పెండ్ ను ముక్త కంఠంతో వ్యతిరేకించాలని బి ఆర్ ఎస్ వి ములుగు జిల్లా నాయకులు దుర్గం రాజ్ కుమార్ పిలుపునిచ్చారు.

# భరత్ నగర్ లో అంబరాన్ని అంటిన హెూలీ సంబరాలు నిర్వహించిన..

## తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళా అధ్యక్షురాలు.. తెలంగాణ మలిదశ ఉద్యమ మహిళ అగ్ర నాయకురాలు, మరియు శ్రమ శక్తి అవార్డు గ్రహీత ఎ.శారద..



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, ( శుభోదయం న్యూస్ ),మార్చి 14 : కూకట్పల్లి నియోజకవర్గం, మూసాపేట్ డివిజన్ లో భరత్ నగర్ కాలనీలో శ్రమ శక్తి అవార్డు గ్రహీత ఎ శారద ఆధ్వర్యంలో హెూలీ సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల, మత,వర్గ,ప్రాంత



భేదాలు లేకుండా సోదర భావంతో, ఆనందోత్సాహాలతో జరుపుకునేటటువంటి రంగుల పండుగ హెూలీ, ప్రజల సమైక్యతను, మతసామరస్యాన్ని ఈ యొక్క పండుగ పెంపొందిస్తుందని అన్నారు. అలాగే ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఉత్సాహాన్ని శక్తిని నింపాలని, హెూలీ పండుగ రంగుల ఐక్యతకు ప్రతీకగా అందరి జీవితాలు సుఖ సంతోషాలతో వెరిజిల్లాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో కాలనీవాసులు, జిహెచ్ఎంసి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బీర్కూర్ లో ఘనంగా హెూలీ పండుగ సంబరాలు



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో హెూలీ పండుగ ఘనంగా నిర్వహించారు చిన్న పెద్ద అని తేడా లేకుండా ప్రతి ఒక్కరూ రంగులు చల్లుకొని హెూలీ శు భాకాంక్షలు తెలుపుకున్నారు హెూలీ అంటే అందరికీ సరదా అని పిల్లలనుంచి పండు ముసలి వరకు రంగులు చల్లుకుంటూ ఆ లింగనం చేసుకుంటారు మనసులో చెడును దహనం చేసేదే హెూలీ హెూలీ పండుగ జరుపుకోవడానికి తెలంగాణలో చాలా ప్రాంతాలలో హెూలీ కి ఒకరోజు ముందు కూడలల్లో కట్టెలు పేర్చి కామదానం చేశారు కామ దహనం చేసిన బూడిదను పెట్టుకొని తెల్లారి స్థానం మర్చటి ఆచారంగా ఉంది పిల్లలు పిల్లలు భయపడుతున్నట్టయితే కాముని బూడిది పెడతారు ఇంకొక్క పురాణ కథ కూడా ఉంది హెూలీ రోజు శ్రీకృష్ణుడు గోపికలతో కలిసి బృందావనంలో పువ్వులతో రంగుల ఉత్సవాన్ని జరుపుకునేందుకు భావిస్తారు ఇలా రంగులు పూలు చల్లుకోవడం ద్వారా ప్రేమ సాభాగ్యుల వెల్లి ఇదుస్తాయని నమ్మకం కృత్రిమ



యోగంలో రఘునాథుడు దాని సూర్యవంశ మహారాజు ఉండేవాడు ఓ రోజంతా ప్రజలు వచ్చి పోలిక అనే రాక్షసి తమ తమ పిల్లల బాధిస్తుందని మొరపెట్టుకుంటారు ఆ సమయంలో అక్కడ ఉన్న నారద మహర్షి ఎటు పౌర్ణమి రోజు ఓరికను పూజిస్తే బాధలు తొలగిపోతాయని తెలుపుతాడు ఆ పూజలు పగటివేల చేస్తే కష్టాలు వస్తాయని రాత్రివేళ నిర్వహించాలని వివరిస్తాడు ధోళిక అంటే ఉయ్యాలని అర్థం కూడా ఉంది మాసం పూర్ణం స్థితిలో బాలకృష్ణుని ఉయ్యాల వేసినట్టు పురాణాలు తెలుపుతున్నాయి పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో హెూలీ రోజు కృష్ణుడు ప్రతిమను ఉయ్యాలలో వేసి డోలు కృత్య జరుపుతారు కృష్ణుడు కూడా రాదను ఊయాలో పెట్టి రంగులు పూస్తున్నట్లు చెబుతారు హిందువులు వసంత కాలంలో వచ్చే పండుగను భారతదేశంలోనే కాకుండా నేపాల్ బంగాళాదేశ్ ప్రవసి భారతీయుల కూడా జరుపుకుంటారు చెడుపై మంచి సాధించి విజయాన్ని కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాస్ బదిలీ బాధాకరం ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు



బీర్కూరు, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎల్లారెడ్డి డిఎస్పీగా శ్రీనివాసులు బదిలీ చేపట్టి నా నుండి ఒక్క రిమార్కు కూడా రాకుండా ఉత్తమ డీఎస్పీగా సేవలందించి బదిలీపై వెళ్తున్న డిఎస్పి శ్రీనివాస్ బదిలీ వెంటనే ఆపేయాలని ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు అంటున్నారు ఎల్లారెడ్డి నియోజకవర్గంలోనే డీఎస్పీ శ్రీనివాస్ ఉత్తమ సేవలందించి ప్రజల మందనాలు పొంది బదిలీపై వెళ్లడం బాధాకరమని ఆయనను బదిలీ నిలిపివేయాలని పలువురు కోరుకుంటున్నారు అయిన చేదించిన కేసులు మరియు అయినా ఎల్లారెడ్డి నియోజక వర్గానికి చేసిన సేవలను ప్రజలు కొని ఆడారు ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాస్ ఒక పోలీస్ అధికారికంగా కాకుండా ఒక ఎల్లారెడ్డి నియోజకవర్గానికి అన్నగా తమ సేవలు అందించి తెలంగాణ రాష్ట్రంలోనే ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాస్ మల్చుకునే విధానం అభినందనీయమని మరియు ప్రజలతో ఎలా నడుచుకోవాలో తెలిసిన వ్యక్తి ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాస్ అని ప్రజలు అంటున్నారు అలాంటి మంచి వ్యక్తిని ఎల్లారెడ్డి డీఎస్పీగా కొనసాగించాలని ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నారు.

# నిరంకుశ నియంతృత్వ ధోరణికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి



మేడిపల్లి మార్చి14 (శుభోదయం న్యూస్) రిపోర్టర్ బైరెడ్డి సందీప్ రెడ్డి : అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై నిజాలు మాట్లాడకుండా కాంగ్రెస్ సర్కారు కుట్రలు చేస్తుందని దానిని ప్రజాస్వామిక వాదులు తిప్పి కొట్టాలని బీఆర్ఎస్ పార్టీ బోడుప్పల్ కార్పొరేషన్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం నాడు బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు దగ్ధం చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలను లేవనెత్తిన మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి పై కాంగ్రెస్ పార్టీ సర్కారు నియంతృత్వ ధోరణితో అసెంబ్లీ సమావేశాలకు బహిష్కరించడం ప్రజాస్వామ్యాన్ని కూనీ చేయడమేనని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి,మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దేవరకొండ పుల్లయ్య చారి వివాహ వార్షికోత్సవ వేడుకలు శుభాకాంక్షలు తెలిపిన విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణచారి



మేడిపల్లి,మార్చి14 శుభోదయం రిపోర్టర్ బైరెడ్డి సందీప్ రెడ్డి: మేడ్చల్ జిల్లా విశ్వబ్రాహ్మణ,విశ్వకర్మ సంఘం కోశాధికారి దేవరకొండ పుల్లయ్య చారి 35వ వివాహ వార్షికోత్సవ వేడుకలు ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు జిల్లా అధ్యక్షులు అన్నోజు కృష్ణచారి ఆద్వర్యంలో సంఘం సభ్యులు పాల్గొని శాలవాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కృష్ణచారి మాట్లాడుతూ సంఘం కోసం నిబద్ధతగా పని చేసే వ్యక్తి పుల్లయ్య చారి అని కొనియాడారు.సంఘం కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటు ప్రభుత్వం నుండి అర్హత కలిగిన పథకాలను ఎప్పటికప్పుడు సభ్యులకు తెలియజేయడంలో ముందుంటాడని అన్నారు.అందరం కలిసిమెలిసి ఉంటేనే మనకు రావల్సిన వాటిని కొట్లాడి దక్కుంచుకోగల్గుతామని గుర్తుచేశారు.అలాగే హెూలి పండగను పురష్కరించుకొని శుభాకాంక్షలు తెలుపుకుంటు రంగురంగుల కలర్లు ఒకరిపై ఒకరు చల్లుకుంటు హెూలీలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మహంకాళి నర్సింహ చారి,వడ్ల కృష్ణమాచారి,సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు... మేడిపల్లి తహసీల్దార్ హసీనా

## రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాకేష్ ఫిర్యాదుతో విధులకు అటంకం కల్గించిన ఇద్దరిపై కేసులు...



మేడిపల్లి,మార్చి14 శుభోదయం రిపోర్టర్ బైరెడ్డి సందీప్ రెడ్డి: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హసీనా అన్నారు.మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని సర్వే నంబర్ 63/28 నుండి 63/39 వరకు గల ప్రభుత్వ భూమిని అక్రమించి ఇంటి నిర్మాణం చేశారు. ప్రభుత్వ భూమిని అక్రమణపై ఫిర్యాదుతో తహసీల్దార్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్ఐ రాకేష్ పరిశీలించి ఇంటిని కూల్చివేశారు.దీంతో అక్రమదారులైన రవికుమార్,పుష్ప జెసీబీకి అడ్డు వచ్చి దుర్భాషలాడుతూ ఆర్ఐ,రెవిన్యూ సిబ్బందిని అడ్డగించారు.దీంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేశామని మేడిపల్లి ఇన్స్పెక్టర్ గొవింద్ రెడ్డి తెలిపారు.ఈ మేరకు తహసీల్దార్ హసీనా మాట్లాడుతూ అక్రమంగా ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించమన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు.దళారులను నమ్మి ప్రభుత్వ భూముల్లో స్థలాలు కొనవద్దని తెలిపారు.

# బీర్కూర్ లో ఘనంగా జనసేనా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): కామారెడ్డి జిల్లా బీర్కూరు మండల కేంద్రంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జానసేనా పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అభిమానులు. అభిమానులు కార్క రాజు మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భవించిన 14 సంవత్సరంలోనే అధికారం లోకి వచ్చిన పార్టీ గా నిలిచిన పార్టీ జనసేన పార్టీ అని ఆయన అన్నారు. ముందటి సంవత్సరం ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ వచ్చే సంవత్సరం అధికారం లోకి వచ్చి ఆవిర్భావ దినోత్సవం జరుపుకుందాం అని చాలెంజ్ చేసి అధికారం లోకి వచ్చి నేడు ఘనంగా నిర్వహించారు అని రాజు అనారు ఆయన అభిమానులు గా ఉండడం మా అదృష్టం గా భావిస్తూ రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రిగా చూడడమే మా కోరిక అని అన్నారు ఈ కార్యక్రమం లో అభిమానులు బొగడమీద సాయి,గంగాధర్,రాజు,విఠల్,పవన్,సందీప్,శంకర్,తరుణ్,శేషు,దత్తు,తదితరులు పాల్గొన్నారు

# అడవిలో అగ్ని ప్రమాదం.. 60 గొర్రె పిల్లలు మృత్యువాత


మండలంలోని ఓబులాపూర్ శివారు అడవిలో జరిగిన అగ్ని ప్రమాదంలో గొర్రె పిల్లలు మృత్యువాత పడ్డ ఘటన చోటు చేసుకుంది. మండలంలోని ఓబులాపూర్ శివారు అడవిలో జరిగిన అగ్ని ప్రమాదంలో గొర్రె పిల్లలు మృత్యువాత పడ్డ ఘటన చోటు చేసుకుంది. బాధిత గొర్రెల కాపరుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.ఊట్కూర్ మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరులు కురువ అయ్యలప్ప, బలరాం, జన్నప్ప, ఎర్ర కొండప్ప, తిప్పన్న తమ గొర్రెలను మండలంలోని ఓబులాపురం శివారులో శుక్రవారం మేతకు వదిలారు. ఇదే క్రమంలో 70 వరకు గొర్రె పిల్లలను వెటర్నరీ అధికారి భీమ్ రెడ్డి వ్యవసాయ పొలంలో ఇనుప కంచె పెట్టి ఉంచారు. గొర్రె పిల్లలు కుక్కల బారిన పడకుండా రక్షణగా చుట్టూ పెద్ద మొత్తంలో ముళ్లకంచెను పెట్టడంతో ప్రమాదవశాత్తు ముళ్ళకంచెకు నిప్పంటుకొని దాదాపు 60 గొర్రె పిల్లలు ఘటనాస్థలిలోనే మృత్యువాత పడినట్లు యజమానులు తెలిపారు. గొర్రె పిల్లలు మృత్యువాత పడిన ఘటనలో యజమానులకు రూ. 3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని మాదాసి కురవ సంఘం జిల్లా నాయకులు గోవిందప్ప, ఆశప్ప తెలిపారు. ఈ సందర్భంగా బాధిత గొర్రెల కాపరులను పరామర్శించి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# కౌంటర్‌లో బుక్ చేసిన టికెట్‌ని ఆఫ్‌లైన్‌లో క్యాన్సిల్ చేసుకోవచ్చని తెలుసా..?




ఫుల్ డిటెయిల్స్ ఇవే.. భారతీయ రైల్వేను దేశానికి జీవనాడిగా పేర్కొంటారు. ప్రస్తుతం రహదారులు, రోడ్‌నెట్‌వర్క్ వేగంగా విస్తరించినా.. నేటికీ సామాన్యుల నుంచి ఉన్నత వర్గాల వరకు అందరూ రైలులోనే ఎక్కువ దూరం ప్రయాణించేందుకు ఇష్టపడుతుంటారు. రైలు ప్రయాణం సురక్షితంగా ఉండడంతో సౌకర్యవంతంగా ఉంటుంది. భారతీయ రైల్వేను దేశానికి జీవనాడిగా పేర్కొంటారు. ప్రస్తుతం రహదారులు, రోడ్‌నెట్‌వర్క్ వేగంగా విస్తరించినా.. నేటికీ సామాన్యుల నుంచి ఉన్నత వర్గాల వరకు అందరూ రైలులోనే ఎక్కువ దూరం ప్రయాణించేందుకు ఇష్టపడుతుంటారు. రైలు ప్రయాణం సురక్షితంగా ఉండడంతో సౌకర్యవంతంగా ఉంటుంది. అయితే, రైలు ప్రయాణానికి ముందు తప్పనిసరిగా టికెట్ తీసుకోవాల్సిందే. ఇందు కోసం ఆన్‌లైన్ లేదంటే.. ఆఫ్‌లైన్‌లో రిజర్వేషన్ కౌంటర్లలో టికెట్ తీసుకుంటేనే బెర్తులు దొరుకుతాయి. లేకపోతే ఇబ్బందులుపడే అవకాశం ఉంటుంది.గతంలో ఎక్కువ మంది టికెట్ల బుకింగ్ కోసం రైల్వే రిజర్వేషన్ కౌంటర్లను ఆశ్రయించే వారు. పొడవైన క్యూలు ఉండడంతో చాలామంది ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ వైపు దృష్టి పెడుతున్నారు. ఇంటి వద్దనే ఉండి టికెట్లు బుక్ చేసుకోవడం సౌకర్యవంతంగా ఉంటుంది. అయితే, భారతీయ రైల్వే టికెట్ క్యాన్సిల్‌కు సంబంధించిన రూల్స్‌ను మార్చింది. గతంలో కౌంటర్‌లో తీసుకు రైలు టికెట్‌ను క్యాన్సిల్ చేసుకునేందుకు తప్పనిసరిగా రైల్వే కౌంటర్‌కు వెళ్లాల్సిన అవసరం ఉండేది. కానీ, ప్రస్తుతం భారతీయ రైల్వే ప్రయాణికుల సౌలభ్యం కోసం ఆన్‌లైన్‌లోనూ కౌంటర్ టికెట్‌ను క్యాన్సిల్ చేసుకునేందుకు అవకాశాన్ని కల్పిస్తున్నది. దాంతో ఇంటి నుంచే కౌంటర్ టికెట్‌ను క్యాన్సిల్ చేసుకోవచ్చు. అదెలాగో తెలుకుందాం రండి..!రైల్వే కౌంటర్ టికెట్ క్యాన్సిల్ చేసే ముందు కొన్ని ముఖ్యమైన విషయాలను జాగ్రత్తగా చూసుకోవాల్సి ఉటుంది. అలా చేస్తే ఇంట్లో కూర్చొని టికెట్‌ని క్యాన్సిల్ చేసుకోవచ్చు. కీలకమైన విషయం ఏంటంటే.. కౌంటర్ టికెట్ బుక్ చేసిన సమయంలో మీరు ఏ మొబైల్ నంబర్, ఆధార్‌కార్డ్ నంబర్ సరైనవి ఇచ్చి ఉండాలి. రెండింటిలో ఏది తప్పుగా ఇచ్చినా టికెట్‌ను రద్దు చేసుకునేందుకు రైల్వే కౌంటర్‌కు వెళ్లాల్సి ఉంటుంది.ఆఫ్‌లైన్ టికెట్ ఎలా క్యాన్సిల్ చేయాలంటే..రైల్వే టికెట్‌ను ఆఫ్‌లైన్‌లో క్యాన్సిల్ చేసుకునేందుకు మొదట ఐఆర్‌సీటీసీ అధికారిక వెబ్‌సైట్‌కి వెళ్లాలి. ఎడమ వైపున కనిపించే మెనూని క్లిక్ చేయాలి. అందులో 'మోర్' అని కనిపిస్తుంది.. దానిపై క్లిక్ చేయాలి. అందులో కౌంటర్ టికెట్ క్యాన్సిలేషన్ అనే ఆప్షన్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసిన తర్వాత ఓ విండో ఓపెన్ అవుతుంది. అందులో టికెట్ పీఎన్ఆర్ నంబర్, రైలు నంబర్, సెక్యూరిటీ క్యాప్చా కోడ్ నమోదు చేసిన సబ్‌మిట్ బటన్‌పై క్లిక్ చేయాలి. ఆ తర్వాత రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఓ ఓటీపీ వస్తుంది. దాన్ని ఎంటర్ చేసి సబ్‌మిట్‌పై క్లిక్ చేస్తే టికెట్ క్యాన్సిల్ అవుతుంది.అమౌంట్ రీఫండ్ ఎలాగంటే..?రైల్వే టికెట్ కౌంటర్‌ను ఆన్‌లైన్‌లో క్యాన్సిల్ చేసుకోవచ్చు. కానీ, రీఫండ్ కోసం మాత్రం సమీపంలోని రైల్వే టికెట్ కౌంటర్‌కు వెళ్లాల్సి ఉంటుంది. టికెట్ కౌంటర్‌కు వెళ్లిన తర్వాత, మీరు క్యాన్సిల్ చేసుకున్న రైలు టికెట్ స్క్రీన్‌షాట్ చూపించాలి. దాంతో కౌంటర్‌లో ఉన్న సిబ్బంది పరిశీలించి టికెట్ డబ్బులను మీకు రీఫండ్ చేస్తారు. రీఫండ్ పొందేందుకు రైలు షెడ్యూల్ చేసిన సమయానికి కనీసం నాలుగు గంటల ముందు రైల్వే కౌంటర్‌కు వెళ్లాలి. రైల్వే కౌంటర్‌లో కొనుగోలు చేసిన టికెట్‌ను క్యాన్సిల్ చేసేందుకు ఐఆర్‌సీటీసీలో అకౌంట్ ఉండాల్సిన అవసరం లేదు.అలాగే, ఆఫ్‌లైన్‌లో రైలు టికెట్‌ను బుక్ చేసుకున్న వారు.. బోర్డింగ్ పాయింట్‌ను సైతం ఆన్‌లైన్‌లో చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నది రైల్వే. టికెట్ క్యాన్సిల్ తరహాలోనే ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌కు వెళ్లి.. మోర్ బటన్‌పై క్లిక్ చేయాలి. అందులో కౌంటర్ టికెట్ బోర్డింగ్ పాయింట్ ఛేంజ్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఆ తర్వాత పీఆర్ఆర్ నంబర్, రైలు నంబర్, క్యాప్చా ఎంటర్ చేసి సబ్‌మిట్ చేయాలి. ఆ తర్వాత ఓటీపీని ఎంటర్ చేయాలి. దాంతో టికెట్ బోర్డింగ్ పాయింట్ మారుతుంది. మొదట మీరు టికెట్ బుక్ చేసుకున్న బోర్డింగ్ పాయింట్ నుంచి కాకుండా.. మార్చుకున్న పాయింట్ నుంచే ప్రయాణం చేసేందుకు

# తెలంగాణలో భారీగా పెరిగిన ఉష్ణోగ్రతలు..



ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ.తెలంగాణలో పగటి ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. తెలంగాణలో భారీగా పెరిగిన ఉష్ణోగ్రతలు.. ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ..! తెలంగాణలో పగటి ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆదిలాబాద్‌లో గురువారం అత్యధికంగా 40.3 డిగ్రీలు, నిజామాబాద్‌లో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రతల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం ఆదిలాబాద్, కుమ్రంభీం, మంచిర్యాల, జగిత్యాల జిల్లాలకు వాతావరణ కేంద్రం ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.రాష్ట్రంలో రాగల మూడురోజుల్లో మూడురోజుల్లో ఉదయం పొగమంచే ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే, ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరుగుతాయని పేర్కొంది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. శనివారం 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంటూ.. ఏడు ఏడు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోనూ 39 డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యే అవకాశం ఉందని పేర్కొంది. సాధారణం కన్నా 3.3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.రాష్ట్రవ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. ఈ క్రమంలో పలుచోట్ల రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రుతుపవనాల సీజన్ ముగియడంతో.. జనవరి చివరి వారం నుంచే ఎండలు భారీగా పెరిగాయి. భానుడి ఉదయం నుంచే ప్రతాపం చూపిస్తుండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం నుంచే భానుడు ప్రతాపం చూపుతుండడంతో జనం అల్లాడిపోతున్నారు.ఎండాకాలానికి ముందే ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతుండడంతో జనం భయాందోళనకు గురవుతున్నారు. ఏప్రిల్, మే మాసాల్లో ఎండలు ఏ స్థాయిలో ఉంటాయోనని పేర్కొంటున్నారు. ఓ వైపు ఎండలు పెరుగుతుండడంతో అందరూ జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అత్యవసరమైతే తప్పా.. ఎండల్లో బయటకు వెళ్లకూడదని సూచిస్తున్నారు. బయటకు వెళ్లినా గొడుగులు వెంట తీసుకువెళ్లాలని.. వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు.

# తెలంగాణ గ్రూప్ -3 ఫలితాలు విడుదల



తెలంగాణ : తెలంగాణలో గ్రూప్ -3 ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. గతేడాది నవంబర్‌లో జరిగిన ఈ పరీక్షలు రాసిన అభ్యర్థుల మార్కులతో పాటు జనరల్ ర్యాంకుల జాబితాను టీజీపీఎస్సీ ఈరోజు మధ్యాహ్నం ప్రకటించింది. అలాగే, గ్రూప్–3 పరీక్ష తుది కీ, మాస్టర్ క్వశ్చన్ పేపర్లతో పాటు ఓఎంఆర్ షీట్లను డౌన్‌లోడ్ కోసం అధికారిక వెబ్‌సైట్‌లో https://www.tspsc.gov.in అందుబాటులో ఉంచింది. రాష్ట్రంలో 1,365 గ్రూప్–3 ఉద్యోగాలకు 5,36,400 మంది దరఖాస్తు చేసుకోగా, గతేడాది నవంబర్ 17, 18 తేదీల్లో మూడు పేపర్లుగా జరిగిన ఈ పరీక్షలకు కేవలం 50.24 శాతం మంది మాత్రమే హాజరయ్యారు. ఇటీవల ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మార్చి 10, 11 తేదీల్లో గ్రూప్- 1, గ్రూప్ -2 ఫలితాలను టీజీపీఎస్సీ తాజాగా గ్రూప్–3 ఫలితాలను విడుదల చేసింది. అలాగే, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు నిర్వహించిన పరీక్షల తుది ఫలితాలను మార్చి 17న, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఉద్యోగ పరీక్షల తుది ఫలితాలను మార్చి 19న ప్రకటించనున్నారు.

# నిధులను విడుదల చేయకుండా కేంద్రం మనల్ని మోసం చేసింది

## తమిళనాడు ఆర్థికమంత్రి తంగం తెన్నరసు



చెన్నై : కేంద్రం మనల్ని మోసం చేసిందని.. అందుకే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు సొంత నిధులను కేటాయిస్తున్నట్లు తమిళనాడు ఆర్థికమంత్రి తంగం తెన్నరసు అన్నారు. నేడు ఆయన అసెంబ్లీలో తమిళనాడు డిఎంకె ప్రభుత్వ ఐదవ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. కేంద్రం బలవంతంగా తమిళనాడుపై త్రిభాషా విధానాన్ని, ఎన్ఇపిని అమలు చేయడానికి ప్రయత్నిస్తోంది. ఈ విధానాలను డిఎంకె ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో విద్య కోసం ప్రభుత్వ పాఠశాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వమే సొంత నిధులను ఉపయోగిస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కాగా, ఆర్థికమంత్రి తెన్నరసు బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వ విద్యార్థులపై స్వల్పంగానైనా ప్రభావం పడకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తన సొంత వనరుల నుండి ఉపాధ్యాయుల జీతాలతో సహా నిధులను కేటాయించిందని ప్రకటించారు. ఎన్ని సవాళ్లు ఎదురైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ద్విభాషా విధానానికే కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. 'సమగ్ర శిక్ష' పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం గత ఏడు సంవత్సరాలుగా వివిధ విద్యార్థుల సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తోంది అని ఆయన అన్నారు. త్రిభాషా విధానాన్ని, జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) అమలును అంగీకరించనుందన ఈ సంవత్సరం 2,152 కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయకుండా కేంద్రం మనల్ని మోసం చేసింది. కేంద్ర ప్రభుత్వం అవసరమైన నిధులను విడుదల చేయనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వమే పాఠశాల విద్యార్థుల సంక్షేమం కోసం, ఉపాధ్యాయుల జీతాలు, ఇతర ఖర్చుల కోసం తన సొంత నిధులను కేటాయిస్తోంది. కేంద్రం నుంచి రెండువేల కోట్లను కోల్పోయినప్పటికీ ద్విభాషా విధానానికే కట్టుబడి ముఖ్యమంత్రి మద్దతుగా నిలుస్తాము అని ఆయన ప్రసంగంలో పేర్కొన్నారు. ద్విభాషా విధానాన్ని అనుసరించడం ద్వారా తమిళనాడు.. తమిళ సంస్కృతిని కాపాడుకోవడమే కాకుండా.. యువతకు ఆంగ్ల ప్రావీణ్యం కల్పించి ప్రపంచవేదికపై ఎదగడానికి సాధికారత కల్పించింది అని ఆయన అన్నారు. విద్యాభివృద్ధికి ప్రాథమిక అక్షరాస్యతను పెంపొందించడానికి 'ఎన్నుమ్ ఎజుతుమ్ తిట్టం' వంటి కార్యక్రమాలు చేపట్టామని ఆర్థికమంత్రి తెలిపారు. ఇందులో భాగంగానే వికలాంగ పిల్లలకు ప్రత్యేక విద్య, దూర ప్రాంతాల విద్యార్థులకు రవాణా ఖర్చులు, ఉపాధ్యాయులకు జీతాలు, విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉన్నత విద్యకు మార్గదర్శకత్వం, ప్రత్యేక ప్రతిభను పెంపొందించడానికి కళా ఉత్సవాలు, విద్యా పర్యటనలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పాఠశాలల్లో ఇంటర్నెట్ సౌకర్యాలను కల్పించనున్నట్లు తంగం తెన్నరసు తెలిపారు.

# వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల ఆందోళన



విశాఖ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు ఉద్యోగులు పిలుపునిచ్చారు. ప్లాంట్ ప్రైవేటీకరణ, కార్మికుల తొలగింపునకు నిరసనగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో పలుచోట్ల కార్మికుల నిరసనకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగుల నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే నేడు ప్లాంట్ ప్రైవేటీకరణ, కార్మికుల తొలగింపునకు నిరసనగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపట్టనున్నారు. ఆందోళన అనంతరం జిల్లా కలెక్టర్లకు అఖిలపక్ష కార్మిక సంఘాలు వినతిపత్రం అందించనున్నారు. అయితే, గాజువాకలో నిరసన చేసేందుకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. మరోవైపు.. నిరసనలకు ఇలాంటి ఆంక్షలు ఎన్నడూ లేవని కార్మిక సంఘాల నేతలు చెబుతున్నారు. ఈ క్రమంలో కుర్మన్నపాలెం దీక్ష శిబిరంలోనే నిరసన చేపట్టాలని పోరాట కమిటీ నిర్ణయించింది.

# 'సకల శాఖ మంత్రి నారా లోకేష్': మేరుగు నాగార్జున

తాడేపల్లి: రాష్ట్రంలో విద్యా శాఖను భ్రష్టు పట్టిస్తున్నారని, లోకేష్ సకల శాఖ మంత్రిగా పనిచేస్తున్నారంటూ వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి మేరుగు నాగార్జున మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో చంద్రబాబు రాజకీయ జీవితంలో ప్రభుత్వ విద్యపై సాఫ్ట్ కార్నర్‌తో ఆలోచించారా? అంటూ ధ్వజమెత్తారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించలేకపోతున్నారని.. పుస్తకాలపై వైఎస్ జగన్ బొమ్మలు ఉన్నాయని ఓర్వలేకపోయారంటూ దుయ్యబట్టారు. "ప్రభుత్వ పథకాలపై చంద్రబాబు బొమ్మలు లోకేశ్‌కు కానరాలేదా?. కూటమి పాలనలో పాఠశాల విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారు. రాష్ట్రంలో విద్యారంగం ప్రోత్సాహకంలో విద్యాశాఖ మంత్రిగా లోకేష్ పాత్ర లేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో హయ్యర్ ఎడ్యుకేషన్‌ను క్వాలిటీతో అందించాం. కూటమి పాలనలో వర్శిటీ వైస్ ఛాన్సలర్లను భయపెట్టి రిజైన్ చేయించారు. ఇదేనా విద్యా వ్యవస్థను నడిపించే తీరు" అంటూ మేరుగ నాగార్జున ప్రశ్నించారు. "విద్యాశాఖ మంత్రిగా లోకేష్ విద్యా వ్యవస్థలో ఏమైనా మార్పులు తెచ్చారా?. మేము తెచ్చిన సంస్కరణలను తొలగించడం తప్ప ఇంకేమీ చేయలేదు. అంబేద్కర్ ఆశయాలను చంద్రబాబు ప్రభుత్వం నీరు గార్చింది. జగన్ తెచ్చిన మార్పులను చూసి ఇతర రాష్ట్రాలే మెచ్చుకున్నాయి. కానీ అసెంబ్లీలో చంద్రబాబు, లోకేష్ వెకిలి మాటలు మాట్లాడుతున్నారు. నాలుగుసార్లు సీఎం అయిన చంద్రబాబు ప్రభుత్వ స్కూళ్లను బాగు చేశారా?. ఇంగ్లీషు మీడియం, టెక్నాలజీ అభివృద్ధి, పిల్లలకు యూనిఫాం, షూస్ కూడా ఎందుకు ఇవ్వలేక పోయారు? ..పిల్లల పుస్తకాలు, రేషన్ సరుకులు, కుట్టు మిషన్లు, సైకిళ్లు, శ్మశానాలతో పాటు అప్పడాలు మీద కూడా చంద్రబాబు ఫోటోలు వేశారు. యూనివర్సిటీలో క్వాలిటీ చదువులు చెప్పించాం. అలాంటి యూనివర్సిటీలోని 17 మంది వైస్ ఛైర్మన్లను బెదిరించి రాజీనామాలు చేయించారు. 9 నెలలపాటు వీసీలు లేకుండానే యూనివర్సిటీలను నడిపిన నీచ చరిత్ర ఈ ప్రభుత్వానిది. టీడీపీ నేతల పుట్టినరోజులు, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించిన నీచ చరిత్ర చంద్రబాబుది. చివరికి క్లాసు రూముల్లో పార్టీ సభ్యత్వాలను నమోదు చేసిన నీచ చరిత్ర టీడీపీది. మీ అవసరాలకు యూనివర్సిటీలను వాడుకున్నారేగానీ విద్యార్థుల భవిష్యత్తు కోసం ఏ మంచి ఐనా చేశారా?. ఇప్పటికైనా జగన్ తెచ్చిన సంస్కరణలను అమలు చేయాలి. పేద విద్యార్థులకు నాణ్యమైన చదువులు చెప్పించాలి" అని మేరుగు నాగార్జున డిమాండ్ చేశారు.

# అందని దారం.. వస్త్రోత్పత్తి ఆగం

**ఆర్‌వీఎం ఆర్డర్లు 1.05 కోట్ల మీటర్లు**
**ఇప్పటికి పూర్తయింది 20 లక్షల మీటర్లు..**
**డిసెంబరులో ఆర్డర్లు..**
**మార్చి నాటికీ అందని నూలు**
**గడువులోగా వస్త్రోత్పత్తి గగనమే**
**స్కూల్ యూనిఫామ్స్ బట్టకు కష్టకాలం**
**ఇంకా బీములెక్కని మహిళా శక్తి చీరలు**

సిరిసిల్ల: సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులు, చేనేత, జౌళిశాఖ అధికారుల మధ్య సమన్వయం లోపం.. వస్త్రోత్పత్తికి శాపంగా మారింది. ప్రభుత్వం ఇచ్చే వస్త్రోత్పత్తి ఆర్డర్లకు నూలు (దారం) సరఫరా చేస్తామని ముందుగా అధికారులు ప్రకటించి వేములవాడలో నూలు డిపో ఏర్పాటు చేశారు. కానీ, సిరిసిల్లలో వస్త్రోత్పత్తికి అవసరమైన నూలును సకాలంలో అందించడంలో విఫలమయ్యారు. ఫలితంగా ఈనెల 15 నాటికి అందించాల్సిన ఆర్‌వీఎం(రాజీవ్ విద్యా మిషన్), ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలకు సంబంధించిన స్కూల్ యూనిఫామ్స్ వస్త్రాల ఉత్పత్తిలో జాప్యం జరుగుతోంది. సిరిసిల్లలోని పాతికవేల మరమగ్గాల (పవర్‌లూమ్స్)పై షూటింగ్, షర్టింగ్, ఓనీ వస్త్రాలు ఉత్పత్తి చేయాల్సి ఉండగా.. దానికి అవసరమైన నూలు అందించలేదు. దీంతో గడువులోగా వస్త్రాల తయారీ కష్టంగా మారింది.

## ప్రభుత్వ లక్ష్యానికి గండి

స్కూళ్లు తెరిచే నాటికి (జూన్ మొదటి వారంలో) అన్ని ప్రభుత్వ స్కూళ్లు, గురుకులాల్లోని పిల్లలకు రెండు జతల యూనిఫామ్స్ అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు డిసెంబర్‌లో సిరిసిల్ల నేతన్నలకు కోటి ఐదు లక్షల మీటర్ల వస్త్రాల ఆర్డర్లు ఇచ్చారు. ఈ బట్ట ఉత్పత్తికి అవసరమైన నూలును డిపో ద్వారా అందించేందుకు టెండర్లు పిలిచారు. ఈ మొత్తం ప్రాసెస్ పూర్తయి.. సిరిసిల్లలోని నేతన్నలకు వేములవాడలోని నూలు డిపో ద్వారా నూలు సరఫరా అయ్యే సరికి ఫిబ్రవరి అయింది. వచ్చిన నూలుకు ఆసాములు పది శాతం మేరకు డీడీలు చెల్లించి, నూలు తీసుకుని వచ్చి భీములుగా పోసి సాంచాలపైకి ఎక్కించారు. ప్రస్తుతం పది లక్షల మీటర్ల వస్త్రాలు సిద్ధంగా ఉండగా.. భీములపై మరో పది లక్షల మీటర్ల వస్త్రం రెడీ అవుతోంది. మొత్తంగా 20 లక్షల మీటర్లు మరో వారంలోగా సిద్ధమైనా.. ఈ నెలాఖరులోగా 50 శాతం వస్త్రోత్పత్తి లక్ష్యం అసాధ్యమే. ఈ లెక్కన వస్త్రాల సేకరణ పూర్తయి, యూనిఫామ్స్ కుట్టి, బడి తెరిచే నాటికి రెండు జతల డ్రెస్సులు అందించాలనే లక్ష్యం సాధించడం కష్టంగానే ఉంది.



## సమస్య ఏంటంటే..!

ప్రభుత్వం టెస్కో ద్వారా సిరిసిల్లలోని మ్యూచువల్ ఎయిడెడ్ సొసైటీ (మ్యాక్స్)లకు వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇవ్వడం, ఇక్కడ మాస్టర్ వీవర్స్ (యజమానులు) నూలును కొనుగోలు చేసి ఆసాముల (పవర్‌లూమ్స్ యజమానులు)కు ఇవ్వడం, వారు సాంచాలు నడుపుతూ, కార్మికులతో పని చేయిస్తూ.. బట్ట నేసి ఇవ్వడం జరుగుతుంది. కానీ, ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేసిన నూలు డిపో ద్వారా నాణ్యమైన నూలు సరఫరా చేస్తామని ప్రకటించిన అధికారులు సకాలంలో అందించలేదు. ఇప్పుడు ప్రైవేటుగా కొనుగోలు చేసి స్కూల్ యూనిఫామ్స్ బట్టను నేయాలని యజమానులను జౌళిశాఖ అధికారులు కోరుతున్నారు. ఆలస్యంగా నూలు ఆర్డర్లు ఇవ్వడంతో వస్త్రోత్పత్తికి విఘాతం కలుగుతోంది. ఇటీవల చేనేత, జౌళిశాఖ కమిషనర్ శైలజా రామయ్యర్ సిరిసిల్ల కలెక్టరేట్‌లో వస్త్రోత్పత్తిదారులతో సమావేశం నిర్వహించి ఈనెల 15లోగా 50 శాతం బట్ట ఇవ్వాలని కోరారు. కానీ ఆ మేరకు సిరిసిల్లలో వస్త్రాల నిల్వలు లేవు.

## మహిళాశక్తి చీరల ఊసేది?

సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్ట్ 8న ఇందిరా మహిళా శక్తి పేరిట స్వశక్తి సంఘాల్లోని మహిళలకు ఏటా రెండు చీరలు ఇస్తామని సీఎం ప్రకటించారు. మొదటి విడతగా 2.12 కోట్ల మీటర్ల చీరల బట్ట ఉత్పత్తి ఆర్డర్లు ఇచ్చారు. దీని విలువ రూ.71.75 కోట్లు ఉంటుంది. కానీ, దానికి సంబంధించిన నూలును ఇప్పటి వరకు సరఫరా చేయలేదు. రెండో విడతగా మరో 2.12 కోట్ల మీటర్ల వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇచ్చేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నా.. మొదటి విడతకే మోక్షం లేక వస్త్రోత్పత్తిదారులు రెండో విడత ఆర్డర్లు తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు నూలు డిపోలో వార్పు (భీముల నిలువు పోగుల), వెఫ్ట్ (అడ్డం కోముల పోగుల) నూలు అందుబాటులో ఉండటం లేదు. వార్పు, వెఫ్ట్ రెండు ఉంటేనే బట్టను మగ్గంపై నేసే అవకాశం ఉంది. ఒకటి ఉండి ఒకటి లేక వస్త్రోత్పత్తికి ప్రతిబంధకంగా మారింది. స్కూల్ యూనిఫామ్స్ వస్త్రాల తయారీ సాగుతుండగా, ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తి మరింత ఆలస్యం కానుంది.

**సిరిసిల్ల వస్త్రపరిశ్రమ స్వరూపం**

| | |
|---|---|
| పవర్‌లూమ్స్: 20,302 | మ్యాక్స్ సంఘాలు: 129 |
| వస్త్రోత్పత్తి ఆర్డర్లు పొందిన మ్యాక్స్‌లు: 113 | |
| సంఘాల్లోని ఆసాముల సంఖ్య: 1,597 | ఆర్‌వీఎం, సంక్షేమ శాఖల వస్త్రోత్పత్తి ఆర్డర్లు: 1.05 కోట్ల మీటర్లు |
| ఒక్కో మీటరు బట్ట ఖరీదు సగటున: రూ. 50 | వస్త్రోత్పత్తి ఆర్డర్ల విలువ: రూ. 50.50 కోట్లు |
| ఇప్పటికి సిద్ధమైన వస్త్రాలు: 10 లక్షల మీటర్లు (మరో పది లక్షలు మగ్గాలపై ఉంది) | |

## ఆలస్యమైనా లక్ష్యం సాధిస్తాం

కొంత ఆలస్యమైనా వస్త్రోత్పత్తిలో లక్ష్యం సాధిస్తాం. ఈ మేరకు సిరిసిల్లలోని వస్త్రోత్పత్తిదారులను ప్రోత్సహిస్తున్నాం. కొత్తగా నూలు డిపో ఏర్పాటు చేసి నూలు సరఫరా చేస్తున్నాం. ప్రైవేటుగా కూడా నూలు కొనుగోలు చేసుకోవచ్చని చెప్పాం. డిపో ద్వారా అందరికీ నూలు ఇవ్వడం సాధ్యం కాదు. ప్రభుత్వ వస్త్రోత్పత్తి లక్ష్యాన్ని సాధించేలా చర్యలు తీసుకుంటాం.

# ఖాకీ రాజ్యం కళ్లు తెరవదా!




వ్యక్తి హక్కును తృణీకరించి అరాచకం రాజ్యమేలేచోట వ్యక్తికిగానీ, సమాజానికిగానీ రక్షణ ఉండ దంటాడు ఆఫ్రో–అమెరికన్ రచయిత ఫ్రెడరిక్ డగ్లస్. జనాన్ని అన్ని విధాలా ఏమార్చి తొమ్మిది నెలల క్రితం అందలం ఎక్కిన కూటమి సర్కారు వల్ల ఆంధ్రప్రదేశ్‌లో అక్షరాలా ఆ పరిస్థితే కొన సాగుతోంది. ఎన్నికల్లో అడ్డూ ఆపూ లేకుండా ఇచ్చిన హామీలేమయ్యాయని అడిగితే... వరస వైఫ ల్యాలను ఎండగడితే... తప్పుడు ప్రచారాలను నిలదీస్తే... జైళ్లు నోళ్లు తెరుచుకుంటున్నాయి. ప్రాథ మిక హక్కయిన భావప్రకటనా స్వేచ్ఛ బందీ అవుతోంది. అడుగడుగునా పౌరుల హక్కులను హరి స్తున్న పోలీసుల తీరును సహించబోమని రాష్ట్ర హైకోర్టు ఇప్పటికి మూడు సందర్భాల్లో ఆగ్రహం వ్యక్తం చేసింది. అయినా ఈ తోలు మందం ప్రభుత్వానికి వివేకం కలిగినట్టు లేదు. అందుకే మంగళ వారం జస్టిస్ రావు రఘునందన్ రావు, జస్టిస్ మన్మథరావులతో కూడిన ధర్మాసనం మరో రెండు కేసుల్లో పోలీసులకు అక్షింతలు వేయాల్సివచ్చింది. పోలీసులైనాసరే చట్టానికి లోబడే వ్యవహరించాలని చీవాట్లుపెట్టింది. ఊహల ఆధారంగా కేసులు పెట్టడం, బెయిల్ రాకుండా తప్పుడు సెక్షన్లు బనాయించటం సహించబోమంది. చిన్న తప్పులే కదా అని వదిలేస్తే రేపు కోర్టుల్లోకొచ్చి కూడా అరెస్టు చేస్తారంది. ఈ వ్యాఖ్యలు చాలు... ఏపీలో పాలన ఎంత నిరంకుశంగా ఉందో చెప్పడానికి! మనసంటే తెలియని, మనుషులంటే లక్ష్యంలేని కూటమి నాయకులకూ, కార్యకర్తలకూ మూడు నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు మనోభావాలు దెబ్బతింటున్నాయి! అంటురోగం ప్రబలినట్టు, ఊరంతా ఒకేసారి పూన కాలు వ్యాపించినట్టు వీరంతా ఉన్నట్టుండి ఫిర్యాదులు చేస్తున్నారు. ఏమైంది వీళ్లకు? ఇదే తీరు కొనసాగిస్తే చట్టాన్ని సవరించి ఇలాంటి కేసుల్లో మొదటగా ఫిర్యాదీదారులను సైకియా ట్రిస్టుల దగ్గరకు పంపాలని... ఎన్నాళ్లుగా మనోభావాలు దెబ్బతిని వున్నాయో, పర్యవసానంగా వారిలో కనబడిన వైపరీత్యాలేమిటో కుటుంబసభ్యుల నుంచి తెలుసుకోవాలనీ నిబంధనలు చేర్చాలన్న డిమాండ్ బయల్దేరినా ఆశ్చర్యం లేదు. ఆ పనిచేస్తే ఇలాంటివారి రోగం కుదురుతుంది. అధికారంలో ఉన్నవారి మెప్పు పొందేందుకు ఫిర్యాదు అందిందే తడవుగా వెనకా ముందూ చూడకుండా పోలీసులు అరెస్టులకు దిగుతున్నారు. గొలుసు కేసులతో వందలాది కిలోమీటర్ల దూరంలోవుండే పోలీస్ స్టేషన్లకు మార్చి మార్చి తిప్పుతున్నారు. ఎవరిపై ఎన్ని కేసులు పెడుతున్నారో గమనిస్తే ఎవ రంటే పాలకులు వణుకుతున్నారో అర్థమవుతుంది. ప్రముఖ సినీ రచయిత పోసాని కృష్ణమురళి సంగతే తీసుకుంటే, 67 ఏళ్ల ఆ పెద్దమనిషిపై లెక్కకు మిక్కిలి కేసులు పెట్టారు. ఒకటి రెండు కేసుల్లో బెయిల్ వచ్చిన వెంటనే మరో కేసు తగిలించి అరెస్టు చేస్తున్నారు. గుండెకు శస్త్ర చికిత్స చేయించుకుని పలు అనారోగ్య సమస్యలతో ఉన్న పోసానిని కేసుల పేరుతో వందల మైళ్లు తిప్పుతున్నారు. సోషల్ మీడియా కార్యకర్త అవుతు శ్రీధర్ రెడ్డిపై పెట్టిన కేసు గమనిస్తే పోలీసుల అత్యుత్సాహం అర్థమవుతుంది. ఒక కేసులో మేజిస్ట్రేట్ ఆయన రిమాండ్‌ను తిరస్కరించి విడుదల చేయాలని ఆదేశించిన వెంటనే పోలీసులు అతి తెలివి ప్రదర్శించి తిరిగి అవే ఆరోపణలతో ఆయనను మరో సారి అరెస్టు చే శారు. ఈసారి న్యాయస్థానం ఆయన్ను రిమాండ్‌కు తరలించింది. ఈ విషయంలో పోలీసుల పనితీరును హైకోర్టు ధర్మాసనం నిశితంగా విమర్శించింది. ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఇష్టానుసారం అరెస్టు చేయటం, చట్టనిబంధనలను తుంగలో తొక్కడం చెల్లదని పేర్కొంది. ఈ విషయంలో యాంత్రికంగా వ్యవహరించినందుకు మేజిస్ట్రేట్‌ను తప్పుబట్టింది. తాచెడ్డ కోతి వనమంతా చెరచినట్టు పోలీసుల తీరు వల్ల కిందిస్థాయి న్యాయస్థానాలకు సైతం మందలింపులు తప్పటం లేదు. నిర్బంధంలోకి తీసుకున్న వ్యక్తికి ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పరు. ఆయన బంధువులకు సమాచారం ఇవ్వరు. అసలు ఆయనపై వున్న కేసులేమిటో చెప్పరు. ఇవి పాటించలేదని తెలిశాక కూడా యాంత్రికంగా రిమాండ్‌కు పంపుతున్న వైనాన్ని ధర్మాసనం ప్రత్యేకించి ప్రస్తావించింది. ఈ ధోరణి సరికాదని మందలించింది. మాదిగ మహాసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కొరిటిపాటి ప్రేమ్ కుమార్ అరెస్టు విషయంలో కూడా న్యాయమూర్తులు ఈ విధంగానే స్పందించారు. వ్యంగ్యంగా, ప్రతీకాత్మకంగా రూపొందించిన ఒక చిన్న రూపకం పోలీసులకు అభ్యంతర కరంగా తోచింది. అంతే... నిరుడు డిసెంబర్‌లో అర్ధరాత్రి దాటాక రెండున్నర గంటలకు కర్నూలు పోలీసులు తలు పులు బద్దలుకొట్టి ప్రేమ్‌కుమార్ భార్యాపిల్లలను వేరే గదిలో బంధించి ఆయన్ను ఈడ్చుకెళ్లారు. హాస్యాస్పదమైన విషయమేమంటే వినయ్‌కుమార్ దగ్గర దొరికిన రూ. 300 అక్రమ వసూళ్లట! పైగా సంఘటిత నేరాలకు పాల్పడ్డారంటూ ఆరోపించి బీఎన్ఎస్‌లోని సెక్షన్ 111 బనాయించారు. ఈ రెండు కేసుల విషయంలో మాత్రమే కాదు... ఇంతకు మునుపు మరో మూడు కేసుల్లో కూడా పోలీసుల తీరును హైకోర్టు తప్పుబట్టింది. డీజీపీని రప్పించాల్సివస్తుందని హెచ్చరించింది. అయినా పోలీసుల తీరు మారడం లేదు. ఈ తెలివితక్కువ చర్యల్ని ఘనకార్యాలుగా భావిస్తూ పాలకులు సిగ్గువిడిచి ఊరేగుతున్నారు. తమకు ఎదురులేదని విర్రవీగుతున్నారు. అలవిమాలిన హామీలిచ్చి, ఈవీఎంలను నమ్ముకుని, డబ్బు సంచులు గుమ్మరించి అందలం ఎక్కిన కూటమి ఇకముందూ ఇదే దోవలో అధికారాన్ని శాశ్వతం చేసుకోవచ్చని కలలు కంటోంది. తప్పు మీద తప్పు చేస్తూ పోతోంది. ఈ క్రమంలో పోలీసులను ఉపయోగించుకుని సంఘటిత నేరాలకు పాల్పడుతోంది. ఎల్లకాలమూ ఈ వ్యవహారం సాగదు. జనం నిజం గ్రహించారు. కీలెరిగి వాత పెట్టే రోజు ఎంతో దూరంలో లేదు.

# ట్రంప్‌నకు ప్రతిఘటన!



సుంకాల పోరు మొదలైంది. అమెరికా ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై బుధవారం నుంచి సుంకం పెంచారు. అంతకు ముందు సోమవారం నుంచే చైనా సుంకాలు అమల్లోకి వచ్చాయి. మహాభారతంలో అర్జునుడు రెండు చేతులతో ఒకే సామర్థ్యంతో బాణాలను సంధించిన కారణంగా సవ్యసాచి అనే పేరు వచ్చింది. అదే మాదిరి అమెరికా అధినేత డోనాల్డ్ ట్రంప్ మిత్రులు, శత్రువులు అని లేకుండా ఎడాపెడా సుంకాలు విధిస్తున్నాడు. దీనికి ప్రతిఘటన పెరుగుతున్నట్లు పరిణామాలు సూచిస్తున్నాయి. వెనక్కు తగ్గకపోతే బాధితురాలైన ప్రతిదేశం ఒక రోజు అటూ ఇటూగా తన అస్త్రాలను సంధించకమానదు.

మొండి వైఖరిని వీడకుండా ముందుకే మునుముందుకే అంటే మాంద్యంలో మునిగేది అమెరికా అని అనేక మంది ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. రాచపీనుగ ఒంటరిగా పోదనట్లు మాంద్యం యావత్ ప్రపంచాన్ని ఏదో విధంగా ఆవరిస్తుంది. గోల్డ్‌మన్ శాచస్ 20శాతం అంటే జెపి మోర్గాన్ 40శాతం అమెరికా మాంద్య అవకాశాలు న్నాయని ప్రకటించింది.దతొలుత చైనా, కెనడా, మెక్సికోల మీద పోరు శంఖం పూరించిన ట్రంప్ తర్వాత బ్రిక్స్ దేశాలు, ఐరోపా యూనియన్, ప్రత్యేకించి మనదేశాన్ని కూడా ఆ జాబితాలో కలిపాడు. అంతటితో ఊరుకోలేదు, సుంకాలు తగ్గించేందుకు భారత్ అంగీకరించిందని బహిరంగంగా ప్రకటించాడు.మన విశ్వగురువు మౌనవ్రతం పాటిస్తూ అలాంటిదేమీ లేదని పార్లమెంటరీ కమిటీ ముందు ఒక అధికారితో చెప్పించారు. అదే సమయంలో ఎలన్‌మస్క్ స్టార్‌లింక్‌తో భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్లు జియో, ఎయిర్‌టెల్ కంపెనీలు ప్రకటించాయి. ఇంతవరకు అసలు స్టార్‌లింక్‌కు మనదేశం అనుమతి ఇవ్వకుండానే ఈ ప్రకటనలు వెలువడ్డాయంటే తెరవెనుక ఏదో జరిగిందనే అనుమానాలు బలపడుతున్నాయి. ఉనికిలో లేని కంపెనీ సేవలు అవి ఎలా అందిస్తాయి ? అమెరికా దిగుమతులపై కెనడా, ఐరోపా యూనియన్ కూడా 25శాతం వంతున ప్రతి సుంకాలు ప్రకటించాయి. మనదేశం మౌనంగా ఉంది. వాణిజ్యాలకు ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలు ఉన్నాయి. వాటిని పక్కన పెట్టి పలుకుబడితో వేర్వేరుగా దేశాలు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి.వాణిజ్య పోరులో ఒక దేశం ఎక్కువా తక్కువా అన్నది పక్కన పెడితే ప్రతిదేశం నిబంధనలకు పాతరవేస్తున్నట్లే. ప్రపంచీకరణ యుగంలో ప్రతిదేశం మరొకదాని మీద ఏదో విధంగా ఆధారపడి ఉన్నందున కర్ర ఉన్నవాడిదే గొర్రె అంటే కుదిరే రోజులు కావివి. మా వస్తువుల మీద పన్నులు వేస్తే మీ కొన్ని రాష్ట్రాలకు సరఫరా చేసే విద్యుత్ నిలిపివేత లేదా పన్నులు వేస్తామని కెనడాలో ఒంటారియో అనే ఒక రాష్ట్ర ప్రధాన మంత్రి కూడా ప్రపంచ అగ్రరాజ్య అధిపతి ట్రంప్‌ను హెచ్చరించాడంటే ఆ ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది. బలవంతుడైన సర్పము చలి చీమలచేత చచ్చినట్లుగా పరిస్థితి ఉందన్నది స్పష్టం. ఒక హానికారక వైరస్ పుట్టుక ఎక్కడైనా ఎటు గాలివీస్తే అటు విస్తరిస్తుంది, తన మన అనే విచక్షణ లేకుండా ఎవ్వరినీ వదలదు.వాణిజ్య పోరు కూడా అలాంటిదే. ఒక వేళ వచ్చే నెల రెండవ తేదీ నుంచి మన వస్తువుల మీద కూడా ట్రంప్ వేటు పడితే ఒక ప్రధాన ఎగుమతి అయిన ఔషధ పరిశ్రమ తీవ్రంగా ప్రభావితం కావచ్చని చెబుతున్నారు. జనరిక్ మందుల ధరలు పెరిగితే కోట్లాది మంది అమెరికన్ రోగులు, గిట్టుబాటుగాక మన పరిశ్రమలు ప్రతికూల ప్రభావాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆ రంగంలోని కార్మికులు, ఉద్యోగులు, వాణిజ్యం కూడా ప్రభావితంగాక తప్పదు.మన దేశం నుంచి ఎగుమతి అవుతున్న జనరిక్స్ విలువ ఏటా 12.7 బిలియన్ డాలర్లు కాగా దాని వలన అమెరికాకు 219 బిలియన్ డాలర్ల మేర ఆరోగ్య ఖర్చు తగ్గిందని అంచనా. మన దేశం అమెరికా, ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న 36 ప్రాణాధార ఔషధాలపై సుంకాలను పూర్తిగా ఎత్తివేసినప్పటికీ ట్రంప్ సంతృప్తి చెందినట్లు కనిపించటం లేదు. మన వాణిజ్యశాఖ మంత్రి పియూష్ గోయల్ అమెరికా వెళ్లి సంప్రదింపులు జరిపిన తర్వాతే ట్రంప్ మనమీద సుంకాల యుద్ధ ప్రకటన చేశాడు.అందరూ నష్టపోతారంటూ ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ చేసిన హెచ్చరికను వాణిజ్యపోరుకు నాందిపలికిన ట్రంప్ తలకెక్కించుకుంటాడా! తగ్గేదేలే అంటూ ముందుకు పోతాడా!! సుంకాల పోరులో అంతిమంగా పరాజితులు వినియోగ దారులే. ఏ దేశం ఎంత పన్ను పెంచితే ఆ మేరకు భారం భరించాల్సిందే. వస్తువుల కొనుగోలు తగ్గించుకుంటే అది ఒక విషవలయంలా మారుతుంది.చివరకు కష్టజీవులనే బలి తీసుకుంటుందన్నది చరిత్ర చెప్పిన సత్యం.

# రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన


### శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ

### ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై గవర్నర్‌కు ఫిర్యాదు



అమరావతి : రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రంలో కూటమి పాలన సాగుతోందని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. ముఖ్యమంత్రి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై వైసిపి బృందం తరుపున గవర్నర్‌కు అబ్దుల్ నజీర్‌కు గురువారం ఆయన వినతిపత్రం సమర్పించారు. అనంతరం రాజ్‌భవన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. సిఎం సమాజంలో వివక్షను పెంచేవిగా ఉన్నాయని, వాటిపై గరవ్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించామని ఆయన తెలిపారు. సిఎం వ్యాఖ్యలపై తక్షణం జోక్యం చేసుకోవాలనీ విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఇటీవల గంగాధర నెల్లూరులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ అన్ని పనులూ తెలుగుదేశం వారికే చేయాలని, వైసిపి వారికి ఏ పనీ ఏయకూడదని అలా చేస్తే పాముకు పాలుపోసినట్లేఅని చేసిన తీవ్ర వ్యాఖ్యలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే సమయం లో అందరికీ న్యాయం చేస్తానని చెబుతారని, దానికి విరుద్ధంగా చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరామని బొత్స వివరించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందుకునే లబ్దిదారులకు పార్టీలు ఉండవని, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా వాటిని అందించాలని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఏ రాజకీయ నాయకుడూ చంద్రబాబులా మాట్లాడలేదని అన్నారు. రాష్ట్రంలో ప్రజలందరికీ మేలు చేయాలన్నదే ప్రతి రాజకీయ పార్టీ సిద్ధాంతంగా ఉండాలని అన్నారు. సామాన్యుల అవసరాలకు రాజకీయ రంగు పులమడం మంచిది కాదని అన్నారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజల తరుపున పోరాడుతామని తెలిపారు. రాష్ట్రంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులు, జర్నలిస్టులపైనా తప్పుడు కేసులు పెడుతున్నారని వివరించారు. ఈ విషయాన్ని కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. గవర్నర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మేరుగు నాగార్జున, విడదల రజనీ, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు ఉన్నారు.

# దౌత్య పరిష్కారం అవసరం !



బీజింగ్ : ఇరాన్ అణు సమస్యకు దౌత్య పరిష్కారం అవసరమని చైనా పేర్కొంది. ఇరాన్ అణు కార్యక్రమంపై బీజింగ్‌లో శుక్రవారం జరగనున్న త్రైపాక్షిక చర్చలకు చైనా ఆతిథ్యమిస్తోంది. ఈ సమావేశంలో ఇరాన్, రష్యా దౌత్యవేత్తలు పాల్గననున్నారు. ఇరాన్ అణు సమస్యను మరింత పెచ్చరిల్లకుండా నివారించేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో, అన్ని పక్షాలు ప్రశాంతతను, సంయమనాన్ని పాటించాలి. లేదా మరింత ఘర్షణల దిశగా జారిపోతామని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ పత్రికా సమావేశంలో వ్యాఖ్యానించారు. అణు అంశానికి సంబంధించి తలెత్తిన పరిణామాలపై సమావేశం దృష్టి సారిస్తుందని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. చర్చలు సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించడానికి గానూ సమాచార మార్పిడిని, సమన్వయాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ చర్చలు ఉద్దేశించబడ్డాయని చైనా పేర్కొంది. పరస్పర విశ్వాసాన్ని పెంచుకుంటూ, అపోహలను తోసిపుచ్చుతూ అన్ని పక్షాలు కలిసికట్టుగా, నిజాయితీగా కృషి చేయగలవని చైనా ఆశిస్తోందని మావో చెప్పారు. జనవరిలో ట్రంప్ అధికారం చేపట్టిన నాటి నుండి ఇరాన్‌తో కొత్త అణు ఒప్పందానికి కుదుర్చుకోవాలని భావిస్తున్నారు. లేదా ఆంక్షలను మళ్ళీ విధిస్తామని గరిష్టంగా ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. కాగా ఆంక్షలు అమల్లో వున్నంత వరకు ప్రత్యక్ష చర్చలకు తావే లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. తమ దేశం ఎవరికీ తలవంచదని అధ్యక్షుడు మసూద్ పెజెషికాన్ స్పష్టం చేశారు.

# మద్యం దిగుమతులపై 200 శాతం పన్ను

### ఈయూకు ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్ : షాంపైన్, వైన్ సహా అన్ని రకాల మద్యం దిగుమతులపై 200 శాతం పన్ను విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫ్రాన్స్, ఇతర యూరోపియన్ యూనియన్ దేశాలను హెచ్చరించారు. అమెరికా విస్కీపై యూరోపియన్ యూనియన్ 50 శాతం సుంకాన్ని విధిస్తున్న నేపథ్యంలో ఆయన ఈ హెచ్చరికలు చేశారు. 'యూరోపియన్ యూనియన్ అధికారులు ప్రపంచంలోనే అత్యంత శతృవులుగా వ్యవహరిస్తూ అవమానకరంగా పన్నులు వేస్తున్నారు. అమెరికాను దెబ్బతీయడమే వారి ఏకైక లక్ష్యం. విస్కీపై యాభై శాతం సుంకాన్ని వసూలు చేస్తున్నారు. దీనిని తక్షణమే తొలగించకపోతే మేము కూడా ఫ్రాన్స్, ఇతర యూరోపియన్ యూనియన్ దేశాల నుండి వస్తున్న అన్ని రకాల వైన్స్, షాంపైన్లు, ఆల్కహాల్ ఉత్పత్తులపై త్వరలోనే 200 శాతం సుంకం వేస్తాం. ఇది అమెరికా వైన్-షాంపైన్ వ్యాపారానికి ఎంతో మంచిది' అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ట్రూత్ సోషల్‌లో ఓ పోస్ట్ పెట్టారు. కాగా అమెరికా నుండి దొంగిలించిన సంపదను తిరిగి స్వాధీనం చేసుకుంటామంటూ ట్రంప్ చేసిన ప్రకటనపై యూరప్, కెనడా తీవ్ర స్థాయిలో స్పందించాయి. ఒకవేళ అమెరికా 28 బిలియన్ డాలర్ల విలువ కలిగిన సుంకాలు విధిస్తే మేము కూడా అదే స్థాయిలో వసూలు చేస్తామని యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు వాన్ డర్ లేయాన్ స్పష్టం చేశారు. కేవలం స్టీల్, అల్యూమినియం ఉత్పత్తుల పైనే కాకుండా వస్త్రాలు, గృహోపకరణాలు, వ్యవసాయ వస్తువులపై కూడా ఏప్రిల్ 1 నుండి పన్నులు ఉంటాయని అసోసియేట్ ప్రెస్ తెలిపింది.

# కెసిఆర్ ప్రభుత్వం దళితులకు విలువ ఇవ్వలేదు: చామల


హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకూ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అయితే జగదీశ్ రెడ్డి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలంటూ.. బిఆర్ఎస్ నేతలు నిరసనలు చేస్తున్నారు. తాజాగా ఈ విషయంపై కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ స్పందించారు. గతంలో బిఆర్ఎస్, కెసిఆర్ ప్రభుత్వం దళితులకు విలువ ఇవ్వలేదని ఆయన అన్నారు. ఇప్పుడు తమ స్పీకర్‌ను బిఆర్ఎస్ అవమానించిందని మండిపడ్డారు. కెటిఆర్‌కు దళితులపై ఉన్న ప్రేమేంటో ప్రజలంతా గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్ల ప్రభుత్వంలో ఉన్న మీరు స్పీకర్‌కు ఇస్తున్న విలువ ఏంటో తెలుసుకోవాలని పేర్కొన్నారు. దళిత స్పీకర్‌ను అవమానించి, అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేస్తాననడం సిగ్గు చేటని అన్నారు. కెటిఆర్‌కు దళితులపై ఎలాంటి చిత్తశుద్ధి లేదని.. రెచ్చగొట్టేలా మాట్లాడి అసెంబ్లీని స్తంభింప చేస్తున్నారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పతనావస్థలో ప్రజాస్వేచ్ఛ





తన ఇస్లాం వ్యతిరేకతను తెలపడానికి ఇరాకీ వలసజీవి సల్వాన్ మోమికాను భావప్రకటన స్వేచ్ఛను గౌరవిస్తూ స్వీడన్ పోలీసులు 2023లో అనుమతించారు. అతను స్వీడన్ సెంట్రల్ మసీదు బయట ఖురాన్‌ను కాల్చాడు. 29 జనవరి, 2025న మోమికాను రాజధాని స్టాక్‌హోంలో చంపారు. ఈ హత్యలో విదేశీ ప్రభావం ఉండచ్చని ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్సన్ అన్నారు. ఉప ప్రధాని ఎబ్బా బుష్ ఈ హత్యను ఖండించారు. ఇది మా పారదర్శక ప్రజాస్వామ్యానికి ముప్పన్నారు. నిందితులను అరెస్టుచేశారు. ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో స్వీడన్ రాయబారి కార్యాలయం ముందు నిరసన తెలిపారు. స్వీడన్ రాయబారిని నగరం నుంచి బహిష్కరించారు. ఇది 1988లో 'సైతాను శ్లోకాలు' నవల రాసినందుకు కక్షతో సల్మాన్ రష్దీ పై 2022లో ఇరాన్ హత్యా ప్రయత్నం లాంటిది. స్వేచ్ఛావాద స్వీడన్ సమాజంలో భావప్రకటన స్వేచ్ఛలో భాగమైనా మతద్వేషం అపాయమని, దాన్ని హింసతో అరికట్టాలని భావించారు. ఖురాన్ దహన నేరానికి స్వీడన్ రాజ్యం శిక్షించే ముందు మోమికాను చంపారు. ఫిబ్రవరి 4 న మరో నిందితుడు సల్వాన్ నాజెమ్‌కు అప్పీల్ అవకాశంతో శిక్ష, 4 వేల క్రోనార్ల జరిమానా విధించారు. నిందితులు మతవిమర్శ పరిధి దాటారని కోర్టు వ్యాఖ్యానించింది. స్వీడన్ 20 వ శతాబ్దంలో మతనింద వ్యతిరేక చట్టాలను వదిలేసింది. కొన్నేళ్ళుగా స్కాండినేవియన్ దేశాల్లో మతోన్మాదం పెరిగింది. ప్రభుత్వాలు భావప్రకటన స్వేచ్ఛను నియంత్రించాయి. గతేడాది డెన్మార్క్ మతనింద నిరోధ చట్టాలను పునరుద్ధరించింది. స్వీడన్ మతవిద్వేష చట్టాలను అమలుచేస్తోంది. మత తాత్వికత, మత గ్రంథా లు, మత విమర్శలను అడ్డుకుంటోంది. ప్రపంచ మతవిద్వేష నియంత్రణ చట్టాలతో పోల్చితే స్వీడన్ శిక్షలు తక్కువ. ఇరాన్ లాంటి దేశాల్లో మత విమర్శకు మరణదండనే. ఇంగ్లండ్ నిఘాను పెంచింది. 1984 లో పెద్దన్న మిమ్ము గమనిస్తున్నాడని టివిలలో ప్రజలను హెచ్చరించింది. అంతర్జాల ఆగడాలపై తీవ్ర చర్యలతో 2024లో సామాజిక మాధ్యమాలను కట్టడి చేసింది. యుకె పౌరుడు మార్టిన్ ఫ్రాస్ట్ కూతురును పాలస్తీనాపై యుద్ధంలో ఇజ్రాయెల్ చంపింది. మోమికా హత్యకు నిరసనగా ఫ్రాస్ట్ ఖురాన్‌ను కాల్చాడు. అతనిపై ప్రభుత్వం విచారణ చేస్తోంది. మతవిద్వేష నియంత్రణ చట్టాలను ఇంగ్లండ్ 2008లో రద్దు చేసింది. ఖురాన్ ముస్లింల పవిత్ర గ్రంథం. దానిపై నీ ఇష్టా ప్రవర్తన వారికి తీవ్ర బాధను కలిగిస్తుంది. మనది సహనశీల దేశం. అయినా ఖురాన్ దహనాన్ని సహించదు అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. నాజీలు ఆర్యేతర మత సాహిత్య, చరిత్ర పుస్తకాలను కాల్చిన పక్షపాత ధోరణి ఖురాన్ ప్రతుల దగ్ధంలో కనిపిస్తుంది. నాజీలు కాల్చిన పుస్తకాలు, భవనాలు, తీసిన ప్రాణాలు యూదులవి. ఇస్లాం- ద్వేషంతో ఇస్లామేతరులు కాలుస్తున్న పుస్తకాలు వారివే. కూలుస్తున్న మసీదులు, చర్చిలు, కట్టడాలు దేశచారిత్రక సంపద. బైబిల్, గాంధీ, అంబేద్కర్ విగ్రహాల అపవిత్రం, సంఘ్ జాతీయ పతాకాన్ని అవమానించడం ఉన్మాదాలే. ఏ ప్రేరణతో చేసినా ఆక్షేపణలే. ఉదారవాద సమాజాలు అపచారాలను నేరమయం చెయ్యవు. ప్రతి ప్రత్యామ్నాయ చర్యా సంఘ్ మనోభావాలను 'నొప్పించినట్లు' ఇతరుల ప్రతి చర్యా కొందరి అవమానం. మత భక్తులకు సమాజ చర్యలు తమ నమ్మకాల, గ్రంథాల, మతచిహ్నాల భంగాలు. మతచర్యలు నాస్తికులకు అస్తవ్యస్తమే. ఒక జాతీయతకు మరొక జాతీయత నియమప్రవర్తనలు అగౌరవాలు. స్త్రీ పురుషులకు పరస్పర అసభ్యకర సంభాషణలు అభ్యంతరాలు. పురుషాధిపత్య హాస్యాలు స్త్రీల అవమానాలు. ఇవన్నీ సమాజంలో ఉదార రహిత, అసహన భాగాలు. విస్తృతంగా అనువర్తించే విద్వేష నియంత్రణ చట్టాలు హాస్యం, కళాత్మకత, సృజనాత్మకత, చర్చలేని ఆధిపత్యానికి దారితీస్తాయి. ద్వేషపూరిత, అవమాన ఉపన్యాసాల నియంత్రణ చట్టాలను కొందరి భావాలను నిరోధించడానికే ఉపయోగిస్తారు. ఐరోపా దేశాల్లోనూ ఇప్పుడు ముస్లిం వ్యతిరేక కార్యక్రమాలు పెరిగాయి. ఆ ప్రభుత్వాల ముస్లిం వ్యతిరేక మద్దతును పారదర్శక, ప్రజాస్వామ్య సమాజాలు సమర్థించవు. విద్వేష నియంత్రణ చట్టాలను మైనారిటీల, అణగదొక్కబడిన వర్గాల నోర్లు మూయించడానికి వాడిన ఉదంతాలు చరిత్రలో ఉన్నాయి. నియంత్రణ చట్టాల పక్షపాతంతో ద్వేషం, అసహనం తలెత్తుతాయి. బాధితులకే అన్యాయం జరుగుతుంది. పీడితుల ప్రశాంత నిరసనల నిరాకరణతో అశాంతి, హింస, అసాంఘిక చర్యలు పెరుగుతాయి. సామాజిక విభేదాల, సంఘర్షణల నిలుపుదలకు వాక్ స్వాతంత్ర్యం తప్పనిసరని పరిశోధనలు నివేదిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల, ఇంటర్‌నెట్, స్మార్ట్ ఫోన్ల యుగంలో పాలకవర్గ ఆధిపత్య నియంత్రణ, పాలితవర్గ పక్షపాతం, మత సామరస్యం అవసరం.

# పడగ నీడలో పాత్రికేయం



మన దేశం ప్రజాస్వామ్యమే అయినప్పటికీ రానురాను పాలకుల్లో నియంతృత్వ పోకడలు పెచ్చుమీరుతున్నాయి. పత్రికా స్వేచ్ఛకు అనేక ప్రతిబంధకాలు ఎదురవుతున్నాయి. పత్రికా స్వేచ్ఛ అంటే భావప్రకటన స్వాతంత్ర్యం. దేశంలో జరుగుతున్న పరిణామాలపై నిర్భయంగా అభిప్రాయాన్ని ప్రకటించే స్వేచ్ఛ. అలా ఎవరైనా పాత్రికేయులు తమ విధులను నిర్వర్తిస్తే వారికి రక్షణ కరవై ప్రాణాలతో చెలగాటమాడే దుస్థితి ఎదురైతే పత్రికాస్వేచ్ఛ అన్నది శూన్యమైనట్టే. అంతేకాదు ప్రజాస్వామ్యం కూడా అడుగంటిపోయినట్టే అవుతుంది. ప్రజాస్వామ్యభవనానికి ఉన్న నాలుగు స్తంభాల్లో పాత్రికేయం కూడా ఒకటి అన్న వాస్తవం మరిచిపోరాదు. కానీ ఇప్పుడు చాలావరకు పడగనీడలో పాత్రికేయం బిక్కుబిక్కుమంటూ మనుగడ సాగిస్తోంది. అవినీతిని, అక్రమాలను బయటపెట్టే పరిశోధనాత్మక కథనాలకు ప్రమాదం పొంచి ఉంటోంది. దీనికి తాజా ఉదాహరణ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో దైనిక్ జాగరణ్ దినపత్రిక విలేకరి రాఘవేంద్ర వాజ్‌పేయ్‌ని పట్టపగలే కొందరు దుండగులు అత్యంత పాశవికంగా హత్యచేయడం. వాజ్‌పేయ్‌ని కాల్చిచంపి మోటార్ సైకిల్‌ను తగులబెట్టారు. సీతాపూర్‌లో దైనిక్ జాగరణ్ విలేకరిగా పనిచేస్తున్న వాజ్‌పేయి రాస్తున్న వార్తా కథనాలే ఉరితాళ్లుగా మారాయి. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో జర్నలిస్టులపై ఇలాంటి కిరాతక చర్యలు సాగుతుండడం పరిపాటి అయింది. సంఘ విద్రోహులు ఎలాంటి అడ్డూఆపూ లేకుండా విచ్చలవిడిగా పేట్రేగిపోతున్నా ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం కానీ, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కానీ ఎలాంటి నివారణ చర్యలు చేపట్టకపోవడం మన ప్రజాస్వామ్య వ్యవస్థకే తీరని కళంకం. చైనా నుంచి నిధులు అందుతున్నాయంటూ 2023లో ఆన్‌లైన్ న్యూస్‌పోర్టల్ న్యూస్‌క్లిక్ కార్యాలయాలపై కేంద్ర ప్రభుత్వమే దాడులు జరిపించడం తీవ్ర సంచలనం కలిగించిన విషయం తెలిసిందే. ఆనాడు ఏకకాలంలో 100కి పైగా ప్రాంతాల్లో సాగిన ఈ తనిఖీల్లో పెద్ద ఎత్తున ఎలక్ట్రానిక్ పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు సహా మరి కొంతమంది సీనియర్ జర్నలిస్టులను విచారణ పేరుతో స్పెషల్ సెల్‌కు తీసుకొచ్చినట్టు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రధాన మంత్రి మోడీని, ఆయనకు మద్దతు ఇచ్చే హిందూ జాతీయవాదుల నేతృత్వంలోని పాలకవర్గాన్ని, మతోన్మాదాన్ని తీవ్రంగా విమర్శించడమే న్యూస్‌క్లిక్ సంస్థపై దాడులకు కారణం. స్వతంత్ర జర్నలిస్టులను వేధించడానికి, బెదిరించడానికి ప్రయత్నాలు అదే పనిగా జరుగుతున్నాయి. దాడులకు వ్యతిరేకంగా మాట్లాడిన మానవ హక్కుల ఉద్యమ నేతలు అరుంధతీరాయ్‌కు కూడా బెదిరింపులు తప్పలేదు. ఉగ్రవాద నిరోధక చట్టం, చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా) వంటివి కూడా పాలకులు ఈ సందర్భంగా ప్రయోగిస్తున్నారు. మణిపూర్‌లో సమాచార దిగ్బంధనం చేశారు. జర్నలిస్టుల గళాలు, కలాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. 2023లో మణిపూర్ సంఘర్షణలపై మీడియా కవరేజిపై నివేదికను ప్రచురించిన ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా నిజనిర్ధారణ బృందంపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయడం శోచనీయం. ప్రజా సమూహాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహిస్తున్నారని, మతపరమైన భావాలను దెబ్బతీసే ఉద్దేశంతో ప్రకటనలు చేస్తున్నారని తదితర తప్పుడు ఆరోపణలతో ఈ ఎఫ్ఐఆర్ దాఖలైంది. ఈ ఎఫ్ఐఆర్‌లో సీమా గుహ, భరత్ భూషణ్, సంజయ్‌కపూర్, ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు సీమా ముస్తఫా పేర్లను పోలీసులు చేర్చారు. గుజరాత్ మారణహోమంలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రిగా మోడీ పాత్రను ఎత్తి చూపిన డాక్యుమెంటరీని రూపొందించి విడుదల చేసిన కొద్ది రోజుల్లోనే దేశంలోని బిబిసి కార్యాలయాలపై ఆదాయపు పన్ను దాడులు జరిగాయి. ఇవి కూడా పత్రికాస్వేచ్ఛకు ముప్పులో భాగంగానే పరిగణించక తప్పదు. 2014 నుంచి పాలనా విధానాల్లోని లోపాలను ఎత్తిచూపే పత్రికల పైన, పాత్రికేయుల పైన దాడులు విపరీతంగా సాగుతున్నాయనడానికి ఎన్నో ఉదాహరణలు కనిపిస్తున్నాయి. రెండేళ్ల క్రితం మన పత్రికా స్వేచ్ఛ ర్యాంకు దారుణంగా పడిపోయిందని రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ అనే సంస్థ బయటపెట్టిన సంగతి తెలిసిందే. ఈ సంస్థ విడుదల చేసిన తన 21 వ నివేదిక ప్రకారం ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో మన దేశం 11 ర్యాంకులు కోల్పోయి, 150 నుంచి 161 స్థాయికి పడిపోయింది. అదే సమయంలో పాకిస్థాన్ 150 ర్యాంకులో నిలబడి పత్రికాస్వేచ్ఛలో మనకంటే మెరుగైన స్థానంలో ఉందని సూచించడం ప్రత్యేకించి గమనించవలసిన విషయం. తాలిబన్ల పాలన లోని అఫ్ఘనిస్థాన్ కూడా పత్రికా స్వేచ్ఛలో 152 ర్యాంకు సాధించుకుని మనకంటే మేలనిపించుకోవడం ఆశ్చర్యకరం. మన దేశానికి పొరుగున ఉన్న భూటాన్ 90 వ ర్యాంకులో ఉండగా, శ్రీలంక కూడా మనకంటే గొప్పగా 135 వ స్థానంలో ఉంది. మన దేశంలో జర్నలిస్టులకు భద్రత అన్నది ఎడారిలో ఒయాసిస్‌లా తయారైంది. ఈ విషయంలో భారత్ 172 వ ర్యాంకుకు మహాపతనం చెందింది. మొత్తం 180 దేశాల్లో భారత్ 172 వద్దనే నిలిచి ఉందంటే మనకంటే జర్నలిస్టుల భద్రతలో కేవలం ఎనిమిది దేశాలే ఉన్నాయని తెలుస్తోంది. దేశంలో భావవ్యక్తీకరణకు అపరిమితమైన స్వేచ్ఛ ఉందని పాలకులు పైకి చెబుతుంటారు. కానీ దేశద్రోహం, పరువునష్టం వంటి చట్టాలు వ్యతిరేక మీడియా మీద ప్రయోగించడం ఎలాంటి పత్రికా స్వేచ్ఛ అనుకోవాలో అర్థం కావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో దేశంలో జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని పాత్రికేయ సంఘాలన్నీ ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి.

# ద్వేష ప్రసంగాలతో ఎవరికి మేలు?



విద్వేష ప్రసంగాలను నివారించడంలో ఎలాంటి జాప్యం పనికి రాదని, ఈ విషయంలో వైఫల్యం జరిగితే న్యాయస్థాన ధిక్కారంగా పరిగణించవలసి వస్తుందని మూడేళ్ల క్రితమే సుప్రీం కోర్టు రాష్ట్రాలకు, పోలీస్ విభాగాలకు హెచ్చరించింది. ఏ మతం వారైనా విద్వేష ప్రసంగాలు చేస్తే తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అయినాసరే ఇవి ఆగడం లేదు. దేశంలో ప్రాంతాలకు, భాషలకు, కులాలకు, మతాలకు అతీతంగా ప్రజలందరూ కలిసిమెలసి బతుకుతున్న ప్రశాంతమైన వాతావరణాన్ని భగ్నం చేయడం క్షమించరానిది. దేశంలోని పాలక వర్గాలవారే విద్వేష ప్రసంగాలు చేయడం, అన్యమతస్థులను ద్వేషించడం, అంతః కలహాలకు అవకాశం కల్పించడం జరుగుతోంది. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్ ఇలా ఎన్నో రాష్ట్రాల్లో ఓట్ల రాజకీయానికి మతోన్మాదానికి ముడిపెట్టి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం కొంతమంది రాజకీయ నేతలకు ఒక జాడ్యంలా పెరుగుతోంది. బుధవారం పశ్చిమబెంగాల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ విపక్ష నాయకుడు, బిజెపి నేత సువేందు అధికారి మరో పది నెలల్లో రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తామని, అప్పుడు తృణమూల్ కాంగ్రెస్‌లోని ముస్లిం ఎమ్ఎల్ఎలను బయటకు వెళ్లగొడతామని, హిందువులంతా కలిసి తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదించుతారని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. స్పీకర్ బిమన్ బెనర్జీని, ముఖ్యమంత్రి మమతా బెనర్జీని తాము ఓడిస్తామని శపథం చేశారు. ఆయన తీరుకు స్పీకర్ ఆగ్రహం చెంది మార్చి 14 వరకు ఆయనను సస్పెండ్ చేశారు. దీనికి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించి ఘాటుగా స్పందించారు. రాష్ట్రంలో వివిధ మతాలు, తెగలు, కులాల వైవిధ్యంతో సామరస్యంగా ప్రజలంతా ఉన్నప్పుడు హిందుత్వం పేరు చెప్పి మరో మతాన్ని, వర్గాన్ని కించపర్చి వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సబబు? అని నిలదీశారు. పశ్చిమబెంగాల్ జనాభాలో 23 శాతం షెడ్యూల్డ్ కులాలు, తెగలు, 33 శాతం ముస్లింలు ఉన్నారని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అంచనాగా ఉదహరించారు. మతం, భాష, కులం, ప్రాంతం తదితర ప్రాతిపదికగా విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు చేసేవారికి భారత శిక్షాస్మృతి 153ఎ, 153బి, 295ఎ, 298, 505(1), 505(2) సెక్షన్ల కింద శిక్షలు విధించే అవకాశాన్ని చట్టం కల్పిస్తోంది. కానీ ఆ సెక్షన్లు ప్రకారం బాధ్యులపై గట్టి చర్యలు తీసుకుంటున్న సందర్భాలు మచ్చుకి కూడా కనిపించవు. ఈ విద్వేషాల ప్రసంగాల కేసుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది తప్ప శిక్షలు పడడం లేదు. ఈ నెల 14వ తేదీ శుక్రవారం హెూలీ పండగ కాబట్టి ముస్లింలంతా నమాజ్ చేసుకోడానికి బయటకువస్తే ఎవరైనా రంగులు జల్లితే ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడతాయని, అందుకే ముస్లింలంతా ఇళ్లల్లోనే ఉండాలని ఉత్తరప్రదేశ్‌లోని సాక్షాత్తు సంభాల్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అనూజ్‌కుమార్ చౌదరి హుకుం జారీ చేయడం విచిత్రం. దీనికి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గట్టిగా ఆ పోలీస్ అధికారిని మందలించడానికి బదులు సమర్థించారు. పైగా తలపాగా ధరించి ముస్లింలంతా నమాజ్‌కు ఎళ్లాలట. ఆ రోజున శాంతిభద్రతలను పరిరక్షించడానికి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత కాదా? ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఓ కులం, మతం లేదని బిజెపి నాయకుడే ఒకరు వ్యక్తిగతంగా నిందించడం తీవ్ర చర్చనీయాంశం అయింది. బిజెపి, దాని అనుబంధ సంస్థలకు చెందిన ముఖ్యులు తరచుగా విద్వేష ప్రసంగాలకు పాల్పడుతుండడం పరిపాటి అయింది. గతంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పత్రికల ఇంటర్వ్యూల్లో ముస్లింలు తమ పరిధుల్లో తాము ఉండాలని, ఒకప్పుడు దేశాన్ని పాలించారు గనుక మళ్లీ పాలించాలని వారు కోరుకోకూడదని సెలవిచ్చారు. ఇందులో ఎంత విద్వేషం దాగి ఉందో తెలుస్తుంది. అలాగే ఎవరో వ్యక్తులు చేసే నేరాలను వారి మతస్థులందరికీ ఆపాదించి వారి దుకాణాలను, రెస్టారెంట్లను బహిష్కరించడం లేదా దాడి చేసి ధ్వంసం చేయడం అమానుషం. ఇలాంటి సంఘటన మహారాష్ట్రలో ఇటీవల జరిగింది. మహారాష్ట్ర సింధుర్గ్ జిల్లాలో మాల్వాన్ అనే చిన్న పట్టణంలో పదిహేనేళ్ల ముస్లిం బాలుడు భారత్ పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ చూస్తూ పాకిస్థాన్ అనుకూల నినాదాలు చేశాడని అరెస్ట్ చేశారు. ఆ కుటుంబం నడుపుకుంటున్న చిన్న షాపును ఫిబ్రవరి 25న ధ్వంసం చేశారు. మతం పేరుతో అనేక కేసులు బనాయించి అతని తల్లిదండ్రులను జైలుకు పంపించారు. ఆ బాలుడ్ని పరిశీలన గృహంలో చేర్చారు. అంతేకాదు తరువాత ఈ కుటుంబాన్ని అక్కడ నుంచి తరిమేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన సాగించారు. సుప్రీం కోర్టు తీర్పుకు విరుద్ధంగా ఆ కుటుంబం షాపును బుల్డోజర్లతో ధ్వంసం చేయడంతో ఆ కుటుంబం దిక్కూమొక్కూలేక రోడ్డునపడింది. ఇదే విధంగా ముస్లిం వ్యాపారులను బహిష్కరించాలని మహారాష్ట్రలోని మాధీ గ్రామ రాజ్యసభ రాజ్యాంగ విరుద్ధంగా తీర్మానించడం గమనార్హం. విద్వేషం సమాజంలోని భిన్నవర్గాల మధ్య సఖ్యతను బలి తీసుకుంటుంది. మెజారిటీ, మైనారిటీ అనే తేడా లేకుండా ప్రజలంతా శాంతియుత సహజీవనం సాగించినప్పుడే దేశం భద్రం గా ఉంటుంది. మైనార్టీలను రెచ్చగొట్టే కొద్దీ ఉగ్రవాద శక్తులకు బీజాలు పడే ప్రమాదం ఉంటుంది. రెచ్చగొట్టి కఠినంగా వ్యవహరించడం వల్ల కీడే గాని మేలు జరగదు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 19 ద్వారా భావప్రకటన స్వేచ్ఛనిచ్చింది. అదే సమయంలో దానిపై పరిమితులను కూడా విధించింది. దీనిని గమనించి వ్యవహరించడం ప్రతి భారత పౌరుని బాధ్యత.